



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE


సంపుటి : 9 సంచిక : 263 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ ఆదివారం 14 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-


# అక్షరాల వెనుక 'అడ్డగోలు' దోపిడీ!

## విద్యా సంవత్సరం ప్రాలంభంతో ప్రైవేట్ విద్యాసంస్థల 'ఫీజు'ల వేట

### చేరేవరకు 'కాళ్లవేళ్ల' ప్రచారం.. చేరాక 'కత్తెర' వేసే వ్యవహారం!

**పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరిట నిలువు దోపిడీ.. 'టీసీ'కి కూడా వెయ్యి సమర్పించుకోవాల్సిందే!**




**కాకినాడ, విశ్వం వాయిస్ – ఎడిటర్ న్యూస్:** బడి గంట మోగకముందే మధ్యతరగతి, పేద తల్లిదండ్రుల గుండెల్లో గుబులు మొదలైంది. 'విద్యా సంవత్సరం' ప్రారంభమైందంటే చాలు.. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు దోపిడీకి తెరలేపుతున్నాయి. స్ట్రా వేసి జుర్రేస్తున్న చందంగా విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పిండుతున్నాయి. అడ్మిషన్ల కోసం ఇంటి చుట్టూ చక్కర్లు కొట్టే యాజమాన్యాలు.. ఒక్కసారి విద్యార్థి స్కూల్లో అడుగుపెట్టాక రకరకాల ఫీజుల పేరిట చర్మం వలచడమే పనిగా పెట్టుకున్నాయి. ఏ ఒక్కదానికీ 'వెయ్యి' రూపాయల లోపు మాట్లాడే పరిస్థితి లేకుండా పోయింది.

**చేరేవరకు 'పట్టువదలని విక్రమార్కులు'!**

బడి తెరిచే సమయానికి ప్రైవేట్ స్కూళ్ల ప్రతినిధులు ఇళ్లపై పడుతున్నారు. సమయం, సందర్భం లేకుండా ఫోన్లు చేస్తూ, ల్యాండ్‌మార్క్‌లు వెతుక్కుంటూ వచ్చి మరీ విసిగిస్తున్నారు. "మా దగ్గర ఏసీ క్యాంపస్ ఉంది.. సీబీఎస్ఈ, నీట్, ఐఐటీ, ఎంసెట్ కోచింగ్‌లు ఉన్నాయి.. ఫలితాల్లో మేమే తోపు" అంటూ ఊదరగొడుతున్నారు. తోటి విద్యాసంస్థలపై బురదజల్లుతూ.. "అక్కడ టీచర్లు లేరు, ప్రభుత్వ పర్మిషన్ లేదు" అంటూ మైండ్ గేమ్ ఆడుతున్నారు. ఫీజుల్లో భారీ రాయితీలంటూ నమ్మబలుకుతూ.. విద్యార్థిని చేర్చుకునే వరకు పట్టువదలని విక్రమార్కుల్లా వెంటపడుతున్నారు.

**అడుగుపెడితే 'అడ్డగోలు' బాదుడు!**

తీరా నమ్మి పిల్లలను స్కూల్లో చేర్చిన తర్వాత అసలు రంగు బయటపడుతోంది. ఎల్కేజీ, యూకేజీ తరగతులకే ఏకంగా రూ. 25 వేల నుండి రూ. 30 వేల వరకు

మిగతా .. 2లో..

రేపు సింగపూర్‌కు

# సీఎం చంద్రబాబు

- 15, 16వ తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటన
- 2026 సీఐఐ పెట్టబడుల సన్నాహక రోడ్ షోలో పాల్గొననున్న సీఎం
- సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సీఎం బృందం వరుస భేటీలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సీఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సీఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సీఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్‌బాచ్‌తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సీఐఐ

మిగతా .. 2లో..

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి

# చర్యలు తీసుకోవాలి..!


### మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేసిన ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు



**ప్రొద్దుటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. శనివారం ప్రొద్దుటూరు పర్యటనకు విచ్చేసిన మంత్రికి ఆర్‌డబి అతిథి గృహంలో.. జర్నలిస్టులు వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

మెరిసిన గిల్, రాహుల్..

# అఫ్గాన్‌పై భారత్ ఘన విజయం




**ధర్మశాల, విశ్వం వాయిస్ న్యూస్ :** అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించిన టీమ్ఇండియా అదే జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం

మిగతా .. 2లో..

చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్య ఘటనపై

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండల పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో వారం క్రితం చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. చిన్నారి ఆచూకీని త్వరితగతిన కనుగొనేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాలింపు చర్యల్లో పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవల్ని సైతం వినియోగించుకోవాలన్నారు. దట్టమైన అడవుల్లోకి సైతం వెళ్లగలిగే అటవీశాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంప్ వాచర్స్, నిపుణుల సాయం తీసుకుని పరిసర అటవీ ప్రాంతాలను జల్లెడ పట్టాలని పవన్ తెలిపారు. జ్ఞానేశ్వరి అదృశ్య ఘటనపై ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన పవన్.. శనివారం మరోసారి కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఇప్పటికే 400 మందికిపైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నట్టు, అత్యాధునిక డ్రోన్లతో అణువణువూ

మిగతా .. 2లో..

సెప్టెంబర్ నెల శ్రీవారి దర్శన కోటా..

# 18న ఆన్‌లైన్‌లో విడుదల



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధనకు సంబంధించి సెప్టెంబర్ నెల కోటాను తితిదే జూన్ 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లాటరీలో ఎంపికైన భక్తులు.. ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కేటాయిస్తారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటా, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను అందుబాటులోకి

మిగతా .. 2లో..

అమరావతి నిర్మాణాలపై

# తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

### రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, నిర్మాణ వ్యయాలపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శనివారం అమరావతిలో పర్యటించిన మంత్రి కొండవీటి వాగు, పాలవాగులపై నిర్మిస్తున్న బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాకాలంలో ఆయా బ్రిడ్జిల వద్ద నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా

మిగతా .. 2లో..

# కువైట్‌లో బాలయ్య బర్త్‌డే వేడుకలు

### సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణ



**కువైట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, నటసింహం నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు కువైట్‌లో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభా ప్రాంగణం "జై బాలయ్య" నినాదాలతో మారుమ్రోగింది. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గల్ఫ్ కౌన్సిల్ సభ్యులు వెంకట్ కోడూరి, జనసేన కువైట్ అధ్యక్షులు యెర్రంశెట్టి హరి రాయల్, ప్రవాసాంధ్ర తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు ములకల సుబ్బారాయుడు

మిగతా .. 2లో..

భారీ వర్షాలు..

# అప్రమత్తంగా ఉండాలి

### తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో హైఅలర్ట్‌గా ఉండాలన్నారు. పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు, సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సీఎస్, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్‌లతో సమీక్షించి నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని తెలిపారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. శంషాబాద్ వద్ద బెంగళూరు హైవేపై భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత సిబ్బంది.. మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తున్నారు. షాద్‌నగర్ లోనూ జాతీయ రహదారిపై భారీగా వరద నిలిచింది.

**పోలీసులు హైఅలర్ట్‌లో ఉండాలి: డీజీపీ**

హైదరాబాద్‌లోని

మిగతా .. 2లో..

శ్రీవారి సేవలో

# ఎంపీ సానా సతీష్ బాబు కుటుంబం



**విజయవాడ/ తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తెల్లవారు జామున స్వామివారి సేవలో పాల్గొన్న సానా సతీష్ బాబు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీర్వాదం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు

# జగన్ బ్రాండ్ అంబాసిడర్

### ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. "జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ

మిగతా .. 2లో..

ఆదివారమే

# ఇరాన్‌తో ఒప్పందం : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించడానికి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అమెరికా–ఇరాన్ ఒప్పందం ఆదివారం కుదరనున్నట్లు యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో ఒప్పందంపై జూన్ 14న సంతకాలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సంతకాలు జరిగిన వెంటనే హార్మూజ్ అందరికోసం తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తెలిపారు. అమెరికా–ఇరాన్ మధ్య ఈ ఆదివారం

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# అక్షరాల వెనుక 'అడ్డగోలు' దోపిడీ!

ఫీజులు గుంజుతున్నారు. ఇవి చాలవన్నట్టు:

**ధరలు లేని పుస్తకాల మాయాజాలం :** మార్కెట్లో రెండు, మూడు వేల రూపాయలు కూడా చేయని ప్రైవేట్ పబ్లిషర్స్ పుస్తకాలపై అసలు ధరే ముద్రించరు. వాటిని తామే కొనుగోలు చేయాలంటూ హుకుం జారీ చేసి, రెండింతలు, మూడింతలు (రూ. 6,000 నుండి రూ. 9,000 పైగా) వసూలు చేస్తున్నారు.

**యూనిఫామ్ ఏకఛత్రాధిపత్యం :** ఏకీకృత వస్త్రాలు, బెల్ట్, షూస్ ఫలానా షాపులోనే కొనాలంటూ ఆర్డర్లు వేస్తారు. మార్కెట్లో రూ. 200 లభించే సాధారణ టీ-షర్టును రూ.500కి అంటగడుతూ కమీషన్ల దందా నడుపుతున్నారు.

**కండీషన్ లేని బస్సులు - కళ్లుచెదిరే చార్జీలు:** ఫిట్‌నెస్ లేని, కనీస నిబంధనలు పాటించని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆ బస్సుల రెంట్ పేరుతో వేలల్లో గుంజుతున్నారు. ఒకవేళ ఆర్టీఓ అధికారులకు పట్టుబడితే.. ఆ జరిమానాలను కూడా దొడ్డిదారిన తల్లిదండ్రుల నుంచే వసూలు చేస్తున్నారు.

**ఈవెంట్ల పేరిట 'జుర్రేదు'.. వెళ్లేటప్పుడు 'టీసీ' బాదుడు!**

సంవత్సరం పొడుగునా ఏదో ఒక ఈవెంట్ పేరు చెప్పి, దేనికైనా రూ. వెయ్యి తక్కువ కాకుండా లాగేస్తున్నారు. పరీక్షల ఫీజుల పేరిట అదనపు వసూళ్లు సర్వసాధారణం అయిపోయాయి. ఇవన్నీ భరించలేక, చదువు నచ్చక స్కూలు విడిచి వెళ్ళిపోదామన్నా వదలడం లేదు. నిస్సిగ్గుగా 'ట్రాన్స్‌ఫర్ సర్జవతీఅటఅష్ఠ్వ' (టీసీ) ఇవ్వడానికి కూడా మరో రూ. వెయ్యి డిమాండ్ చేస్తున్నారు. స్కూల్లో చేరేవారిని, విడిచి వెళ్లేవారిని.. ఎట్టి పరిస్థితిలోనూ వదలకుండా డబ్బు ఎలా రాబట్టాలో ప్రైవేట్ విద్యాసంస్థలకు తెలిసినంతగా ఎవరికీ తెలియదనడంలో ఎలాంటి సందేహం లేదు.

**ప్రచారానికి మా బొమ్మలు.. లాభాలు మీ ఖాతాల్లోనా?**

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పైసా పైసా పిండుకుంటూ, ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడే ఈ సంస్థలు.. తమ స్కూల్ ప్రచారానికి మాత్రం అదే విద్యార్థుల ఫోటోలను ఫ్లెక్సీలు, పాంప్లెట్లలో వాడుకోవడం ఎంతవరకు సబబు? విద్యార్థుల ప్రతిభను తమ వ్యాపార పెట్టుబడిగా మార్చుకుంటూ, వారి ఫోటోలతో కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తున్న యాజమాన్యాలు, ఫీజుల విషయంలో మాత్రం ఎందుకు కనికరం చూపడం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**వ్యవస్థ కూకటివేళ్లతో ప్రక్షాళన కావాలి!**

విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందంటేనే తల్లిదండ్రుల గుండెల్లో గుబులు రేపుతున్న ఈ ప్రైవేట్ విద్యా వ్యవస్థను కూకటి వేళ్లతో ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఫీజుల నియంత్రణ చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలను అరికట్టడంతో పాటు, ప్రతి పేద, మధ్యతరగతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్యను ప్రభుత్వ రంగంలోనే అందించేలా కఠినమైన చర్యలు తీసుకోవాలని 'విశ్వం వాయిస్' డిమాండ్ చేస్తోంది.

# రేపు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సీబీఎన్361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్-అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్‌షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్స్ అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈడీబీ సీఈఓ సన్మోహన్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

# అఫ్గాన్‌పై భారత్ ఘన విజయం

సాధించింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించగా.. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (84*; 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సులు) రాణించాడు. ఇషాన్ కిషన్ (34), కేఎల్ రాహుల్ (39*; 19 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు), రోహిత్ శర్మ (16) పరుగులు చేశారు. రెండో వన్డే బుధవారం (జూన్ 17) లఖ్‌నవూలో జరగనుంది. జియావుర్ రెహ్మాన్ వేసిన 22 ఓవర్లో కేఎల్ రాహుల్ వరుసగా 6, 4, 4 బాదేశాడు. ఇదే ఓవర్లో చివరి బంతిని కూడా రాహుల్ స్టాండ్స్‌లోకి పంపాడు. 22 ఓవర్లకు స్కోరు 182/3. టీమ్‌ఇండియా విజయానికి 18 బంతుల్లో 13 పరుగులు అవసరం. జియావుర్ రెహ్మాన్ వేసిన 18 ఓవర్లో శ్రేయస్ అయ్యర్ (12) ఔటయ్యాడు. దీంతో భారత్ 142 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. టీమ్‌ఇండియా విజయానికి 45 బంతుల్లో 53 పరుగులు అవసరం. రషీద్ ఖాన్ వేసిన 13 ఓవర్లో ఇషాన్ కిషన్ (34) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 13 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 117/2.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా

జల్లెడ పడుతున్నట్టు కాకినాడ ఎస్పీ వివరించారు. చిన్నారి ఇంటి పరిసరాల్లోని 38 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించినట్టు తెలిపారు. చిన్నారి అదృశ్యమై వారం రోజులు గడిచిన నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని పవన్ ఆదేశించారు.

# 18న ఆన్‌లైన్‌లో విడుదల

తీసుకొస్తారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటా అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల అవుతుంది. 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల (రూ.300) కోటా, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in/ వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.

## అప్రమత్తంగా ఉండాలి

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటించారు. మల్లంపేట చెరువు, టోలిచౌకీల్లో పరిస్థితిని పరిశీలించారు. సైబరాబాద్ సీపీ రమేష్‌తో కలిసి నీటమునిగిన ప్రాంతాలు, ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. కీలక జంక్షన్లలో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించాలన్నారు. హైదరాబాద్‌తో పాటు వర్ష ప్రభావిత జిల్లాల పోలీసు అధికారులు హైఅలర్ట్‌లో ఉండాలని ఆదేశించారు.

## తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి నిర్మాణాలపై వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే రాజధానిలో నిర్మిస్తున్న భవనాల వ్యయం పూర్తిగా సహేతుకంగానే ఉందని చెప్పారు. అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్ నివాస సముదాయాలకు రూ.984 కోట్లతో టెండర్ ఖరారైందని, నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు కేవలం రూ.3,393 మాత్రమే అవుతోందని తెలిపారు. అలాగే గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణానికి రూ.1,003 కోట్లతో టెండర్ ఖరారైందని, చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే వ్యయం అవుతోందని పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.1,234 కోట్లతో టెండర్ ఖరారైందని, దాని నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,945గా ఉందని మంత్రి వెల్లడించారు. ఈ గణాంకాలను పోల్చి చూస్తే అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్, గెజిటెడ్ అధికారుల నివాసాల నిర్మాణ వ్యయం కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ కంటే తక్కువగా ఉందని స్పష్టమవుతోందన్నారు. రాజధానిలో నిర్మిస్తున్న అనేక భవనాలు సాధారణ భవనాలు కాదని, రాష్ట్ర ప్రతిష్ఠను చాటే ఐకానిక్ నిర్మాణాలని మంత్రి తెలిపారు. భవిష్యత్తు అవసరాలు, ఆధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలు, దీర్ఘకాలిక వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. అందువల్ల కొన్ని ప్రత్యేక భవనాలకు వ్యయం ఎక్కువగా కనిపించినా, వాటి నాణ్యత మరియు ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పార్లమెంట్ భవనం నిర్మాణం, తెలంగాణ సచివాలయం నిర్మాణం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయంలో కూడా మొదట పిలిచిన టెండర్ల అంచనాలతో పోలిస్తే పనులు పూర్తయ్యే సమయానికి వ్యయం పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే అమరావతి నిర్మాణాల విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కొండవీటి వాగు, పాలవాగులపై జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, రాజధాని నిర్మాణంలో వరద నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిలు నిర్మిస్తున్నామని, అందులో వాగులపై 43 బ్రిడ్జిలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో మరో 26 బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు వివరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జిల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి ప్రవాహ మార్గాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్రిడ్జిల నిర్మాణం వల్ల నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గకుండా అన్ని సాంకేతిక ప్రమాణాలు పాటిస్తున్నామని పేర్కొన్నారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో రాజధాని అభివృద్ధి మరింత వేగవంతం కానుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ఒకే ప్రాంతంలో పనిచేసే విధంగా అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నామని తెలిపారు. వైసీపీ నాయకులు అమరావతి నిర్మాణాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, అభివృద్ధిని అడ్డుకునే విధంగా అసత్య ప్రచారాలు కొనసాగిస్తే ప్రజల నుంచి మరింత తిరస్కరణ ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# కువైట్‌లో బాలయ్య బర్త్‌డే వేడుకలు

హాజరై ప్రసంగించారు. వెంకట్ కోడూరి మాట్లాడుతూ బాలకృష్ణ కేవలం సినీ నటుడు మాత్రమే కాకుండా సేవా దృక్పథం కలిగిన గొప్ప వ్యక్తి అని అన్నారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా వేలాది మందికి వైద్య సేవలు అందించడం ఆయన మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా సేవలోనూ ఆయన ప్రత్యేక గుర్తింపు సాధించారని కొనియాడారు. జనసేన కువైట్ అధ్యక్షులు యెర్రంశెట్టి హరి రాయల్ మాట్లాడుతూ, బాలకృష్ణ సినీ రంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆదర్శప్రాయంగా నిలిచారని, ఆయన సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ప్రవాసాంధ్ర తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు ములకల సుబ్బారాయుడు మాట్లాడుతూ, తెలుగు జాతి గర్వించే మహానటుడిగా, ప్రజల అభిమానాన్ని సంపాదించిన నాయకుడిగా బాలకృష్ణ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. నందమూరి తారక రామారావు వారసత్వాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సేవా సమితి అధ్యక్షులు మాట్లాడుతూ, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన బాలకృష్ణ జన్మదిన వేడుకలను నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి లోకేష్ యువసేన కువైట్ కమిటీ సభ్యులు రూ.25,000, మైనార్టీ నాయకుడు గోహర్ అలీ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ కోశాధికారి మోహన్ రాచూరి, అస్మా, పర్వానియా, హవాలి గవర్నరేట్ అధ్యక్షులు ముస్తాక్ ఖాన్, రెడ్డయ్య చౌదరి, రవి మలిశెట్టి, ఎన్టీఆర్ సేవా సమితి ఉపాధ్యక్షులు సి.ఆర్. రమేష్ నాయుడు, గుదే శంకర్, నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు నాగేష్, మైనార్టీ నాయకులు అర్షద్, తెలుగు యువత అధ్యక్షులు మురళీ దుగ్గినేని, లోకేష్ యువసేన కువైట్ అధ్యక్షులు శ్రీనివాసులు, జనసేన నాయకులు ప్రసాద్, మల్లిఖార్జున, శెట్టిపల్లి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ, దేవి చౌదరి, విజయ, సరోజ, శశి తదితరులు, అభిమానులు, ప్రవాస తెలుగు సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు కన్నయ్య, మోహన్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జగన్ బ్రాండ్ అంబాసిడర్

వేల కోట్ల స్కామ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం" అని అన్నారు.

**గొడ్డలి పార్టీ నుంచి రోజుకో కుంభకోణం: మంత్రి స్వామి**


గత ప్రభుత్వంలో కల్తీ మద్యం కేసు తాడేపల్లి ప్యాలెస్ గేటును తాకిందని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఆరోపించారు. "గొడ్డలి పార్టీ నుంచి రోజుకో కుంభకోణం వెలుగులోకి వస్తోంది. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆ పార్టీ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ శాశ్వతంగా కనుమరుగు కానుంది" అని వ్యాఖ్యానించారు.

# ఇరాన్‌తో ఒప్పందం : ట్రంప్

శాంతి ఒప్పందం జరగే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంతకుముందు ప్రకటించారు. అయితే, పాక్ ప్రధాని ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఇరాన్ స్పందించింది. ఇప్పుడే ఒప్పందంపై సంతకాలు జరగవని, ఇందుకు మరింత సమయం పడుతుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరుగుతుందని ట్రంప్ నుంచి ప్రకటన రావడం గమనార్హం.

# అగ్నిపర్వతం లాంటి ఆవేశం నాశనానికా..? నిర్మాణానికా..?

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు మన దైనందిన జీవితం ఒక నిరంతర పరుగుల లంక. ఈ ప్రయాణంలో మనం ప్రతిరోజూ ఎన్నో రకాల మానసిక సంఘర్షణలను, విభిన్న మనస్తత్వాలను ఎదుర్కొంటాం. కొన్నిసార్లు కార్పొరేట్ ఆఫీసులో బాస్ విసిరే కరుకు మాటలు గుండెల్లో తూటాల్లా పేలుతాయి. మరికొన్నిసార్లు నడిరోడ్డుపై ట్రాఫిక్ జామైనప్పుడు, ఎవరో అనాలోచితంగా మన వాహనాన్ని ఢీకొట్టినంత పని చేసినప్పుడు రక్తం ఉడికిపోతుంది. ఇక సొంతింట్లో చిన్నపాటి మాటపట్టింపులకే మనసు మూగబోతుంది. ఇలాంటి ప్రతికూల క్షణాల్లో మన అంతరంగంలో ఒక అగ్నిపర్వతం బద్దలవుతుంది ఆ మానసిక విస్ఫోటనాన్నే మనం క్షణికావేశం అంటాం.క్షణికావేశం అనేది ప్రతి మనిషిలోనూ అంతర్గతంగా ఉండే ఒక సహజమైన భావోద్వేగ తీవ్రత. కానీ, ఆ రగిలిపోయే ఒక్క క్షణంలో మనం తీసుకునే అనాలోచిత నిర్ణయాలు, నోరుజారి అనే కఠినమైన మాటలు, చేసే వినాశకర చర్యలు జీవితకాలం పాటు చెరగని కన్నీటి ముద్రలను, తీవ్ర పరిణామాలను మిగిల్చి పోతాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న ఒక ప్రాణస్నేహం ఒక్క క్షణంలో బూడిదవుతుంది. దశాబ్దాలుగా అల్లుకున్న ఒక పవిత్రమైన బంధం ముక్కలవుతుంది. కష్టపడి సంపాదించుకున్న ఉద్యోగం ఊడిపోతుంది. కొన్నిసార్లు ఈ ఆవేశం శారీరక హింసకు, చట్టపరమైన ఇబ్బందులకు దారితీస్తుంది. అందుకే క్షణికావేశాన్ని సకాలంలో గుర్తించడం, దాని మూలాలను అర్థం చేసుకోవడం, అదుపు చేయడం కేవలం ఒక సామాజిక బాధ్యత మాత్రమే కాదు, అంతకంటే మిన్నగా అది ఒక వ్యక్తి యొక్క సంస్కారానికి, నైతిక విలువకు నిదర్శనం.క్షణికావేశం అనే పదబంధంలోనే దాని అసలు సిసలైన నైజం దాగి ఉంది. క్షణికం అంటే నీటి బుడగలాంటి తాత్కాలిక స్థితి, ఆవేశం అంటే హద్దులు దాటిన ఉద్రేకం. ఈ రెండూ జతకట్టి సృష్టించే ఒక చిన్న భావోద్వేగ తుఫాను మన సుదీర్ఘ జీవితాల్లో కోలుకోలేని విధ్వంసాన్ని కలుగజేయగలదు. ఆ ఊగిపోయే క్షణంలో మనసులోని విచక్షణ పూర్తిగా మరుగున పడిపోతుంది. హేతువు, తార్కిక ఆలోచనలకు తావుండదు. హృదయం గుండెల్లో కాకుండా గొంతులోనే కొట్టుకుంటున్నట్లు ఒక రకమైన ఊపిరాడని అనుభూతి కలుగుతుంది. చేతులు వణుకుతాయి, కళ్ళు ఎర్రబడతాయి, నోటి నుండి మాటలు శరవేగంతో బాణాల్లా దూసుకుపోతాయి.ఆధునిక మానసిక శాస్త్ర పరిశోధనల ప్రకారం, ఇటువంటి అత్యంత ఆవేశపూరితమైన స్థితిలో మన మెదడులోని అమిగ్డలా అనే భాగం పూర్తి నియంత్రణను తన చేతుల్లోకి తీసుకుంటుంది. ఇది మానవ పరిణామ క్రమంలో ఏర్పడిన అత్యంత ప్రాచీనమైన భయ-ప్రతిస్పందన కేంద్రం. ఆ విపత్కర సమయంలో, హేతుబద్ధంగా మరియు ప్రశాంతంగా ఆలోచించేందుకు తోడ్పడే మెదడు పైభాగం తాత్కాలికంగా నిద్రాణ స్థితిలోకి వెళ్లిపోతుంది. ఇది పూర్తిగా జీవశాస్త్ర పరమైన వాస్తవం అయినప్పటికీ, ఈ మానసిక సూత్రాన్ని లోతుగా అర్థం చేసుకున్న వ్యక్తినే స్థితప్రజ్ఞుడు అంటారు.మన పురాణ పురుషుల గాథల్లో, చరిత్ర పుటల్లో క్షణికావేశం వల్ల సంభవించిన దారుణమైన విషాదాలు ఎన్నెన్నో ఉన్నాయి. కురుక్షేత్ర మహాసంగ్రామంలో అసంఖ్యాకమైన ప్రాణాలు, సామ్రాజ్యాలు నేలమట్టం కావడానికి మూల కారణం కేవలం అహంకారం, ఆవేశమే. లంకాధిపతి రావణుడు తన సర్వవంశాన్ని సర్వనాశనం చేసుకుంటూ సీతాదేవిని అపహరించింది కూడా క్షణికావేశంలో తన అహానికి లొంగిపోవడం వల్లే.మరి నేటి ఆధునిక కాలపు పోకడలను గమనిస్తే.నడిరోడ్డుపై చిన్నపాటి ఘర్షణలకే ప్రాణాలు తీసే రోడ్ రేజ్ ఉదంతాలు.నాలుగు గోడల మధ్య అహాల పట్టింపులతో సాగే గృహ హింస.సోషల్ మీడియా వేదికల్లో క్షణికమైన కోపంతో పెట్టే అసభ్యకరమైన, అవమానకరమైన పోస్టులు.ఇవన్నీ కూడా ఆ ఒక్క నిమిషం ఆవేశాన్ని అణచుకోలేక జీవితాలను జైలు పాలు చేసుకున్న అభాగ్యుల కథలే. ఒక్క తప్పుడు మాట మనిషిని జీవితకాలం పాటు పశ్చాత్తాపపు సెగల్లో కాల్చేస్తుంది. ఒక్క తప్పుడు చర్యతో కట్టుకున్న కుటుంబం వీధిన పడుతుంది. క్షణికావేశం అనేది ఒక గొలుసుకట్టు లాంటిది ఒక్క లింకును లాగితే అది మన జీవితపు అల్లికనంతటినీ ముక్కలు ముక్కలుగా విప్పేస్తుంది.క్షణికావేశాన్ని అదుపు చేయడం అసాధ్యమేమీ కాదు. నిరంతర సాధనతో, ఖచ్చితంగా నియంత్రించవచ్చు.మొదటి సూత్రం ఒక్క నిమిషం ఆగు ప్రపంచంలోని ప్రతి శ్రేష్ఠుడూ, తత్వవేత్తా చెప్పిన మొదటి పరమసత్యం ఆగడం. ఆవేశం కట్టలు తెంచుకున్నప్పుడు వెంటనే స్పందించవద్దు. పది నిమిషాల పాటు ఆ ప్రదేశం నుండి దూరంగా వెళ్ళి ఒంటరిగా ఉండండి. ఆ కొద్దిపాటి విరామంలో మీ మెదడు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటుంది. మహాత్మా గాంధీ అన్నట్లు మొదట విను, ఎదుటివారిని అర్థం చేసుకో, ఆపై మాత్రమే నీ స్పందనను తెలియజేయి. శ్వాసపై ధ్యాస ప్రాణాయామం దీర్ఘ శ్వాస అనేది కేవలం యోగాభ్యాసకులకు మాత్రమే పరిమితం కాదు. ఆవేశంతో శరీరం రగిలిపోతున్నప్పుడు, కళ్ళు మూసుకుని నెమ్మదిగా నాలుగు నిమిషాల పాటు లోతైన శ్వాస తీసుకోవడం వల్ల రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు క్రమబద్ధీకరించబడతాయి. దీంతో నరాల ఉద్రిక్తత తగ్గి, శరీరం సడలిపోతుంది. శాస్త్రీయంగా నిరూపించబడిన అద్భుతమైన చిట్కా ఇది.తీవ్రమైన కోపం వచ్చినప్పుడు మనసులోనే ఒక చిన్న ప్రశ్న వేసుకోండి.ఇప్పుడు నన్ను ఇంతలా రగిలిస్తోన్న ఈ విషయం ఐదు సంవత్సరాల తర్వాత కూడా నా జీవితంలో ఇంతే ముఖ్యంగా ఉంటుందా?నూటికి తొంభై తొమ్మిది సందర్భాలలో మీ అంతరాత్మ నుండి వచ్చే సమాధానం లేదు అనే ఉంటుంది. ఈ ఒక్క ప్రశ్న ఆవేశాన్ని చల్లార్చే సంజీవనిలా పనిచేస్తుంది.నిన్ను ఆవేశపరిచిన వ్యక్తిని ఒక శత్రువులా కాకుండా, మనలాంటి ఒక సామాన్య మనిషిగా చూడటం అలవాటు చేసుకోవాలి. బహుశా అతను కూడా ఆ సమయంలో ఏదో ఒక తీవ్రమైన మానసిక వేదనలోనో, ఆందోళనలోనో ఉండి ఉండవచ్చు. ఎదుటివారి కోణం నుండి ఆలోచించే గుణం అలవడితే, మనలోని క్రోధం మంచులా కరిగిపోతుంది.ఆవేశాన్ని లోపల అణచిపెట్టుకుంటే అది గుండె జబ్బులకు దారితీస్తుంది. కాబట్టి, ఆ నెగెటివ్ ఎనర్జీని పాజిటివ్‌గా మార్చండి. కోపం వచ్చినప్పుడు కాసేపు గట్టిగా నడవండి, వ్యాయామం చేయండి, మీకు నచ్చిన పాటలు వినండి లేదా ఒక డైరీలో మీ భావాలను రాసి పారేయండి. క్రోధం అనేది ఒక శక్తి దానిని వినాశనానికి కాదు, వికాసానికి వాడుకోవాలి.రోజువారీ జీవితంలో కనీసం పది నిమిషాలు ధ్యానం చేయడం అలవాటు చేసుకోండి. ఇది మెదడును రియాక్షన్ (వెంటనే స్పందించడం) నుండి రెస్పాన్స్ (ఆలోచించి స్పందించడం) వైపు నడిపిస్తుంది. నిరంతరం ధ్యానం చేసే వ్యక్తి అత్యంత సంక్లిష్టమైన పరిస్థితుల్లోనూ చెదరని చిరునవ్వుతో, ప్రశాంతమైన సాక్షిగా నిలబడగలడు.ఆత్మనిగ్రహం అనేది ఎంతమాత్రం బలహీనత కాదు; అది మానసిక పరిణితికి, అత్యున్నత అంతర్గత శక్తికి నిదర్శనం. నిజమైన బలవంతుడు ఎవరంటే సమాజంలో కండబలం చూపించేవాడు కాదు, ఆవేశం ముంచుకొచ్చినప్పుడు కూడా తన నాలుకను, మాటలను అదుపులో ఉంచుకోగలిగినవాడు. రణరంగంలో వేలాది మంది శత్రువులను జయించిన యోధుడి కంటే, తన స్వంత మనసును, క్రోధాన్ని జయించినవాడే అసలైన జగజ్జేత!మనం ఎవ్వరమూ సమాజానికి దూరంగా, ఒక దీవిలో ఒంటరిగా బతకడం లేదు. మన ప్రతి చిన్న ప్రవర్తనా మన కుటుంబ సభ్యులను, స్నేహితులను, తోటి ఉద్యోగులను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా ఇంట్లోని పిల్లలు తల్లిదండ్రుల నడవడికను నిశితంగా గమనిస్తూ, వారినే అనుకరిస్తూ పెరుగుతారు. ఒక తండ్రి లేదా తల్లి ఇంట్లో నిరంతరం ఆవేశంతో, అరుపులతో ప్రవర్తిస్తే, ఆ పిల్లలు కూడా భవిష్యత్తులో అదే హింసాత్మక ధోరణిని తమ జీవితాల్లోకి వంటబట్టించుకుంటారు. కాబట్టి, క్షణికావేశాన్ని అదుపులో ఉంచుకోవడం అనేది కేవలం మన వ్యక్తిగత గెలుపు మాత్రమే కాదు, మనం రాబోయే తరాలకు, సమాజానికి ఇచ్చే గొప్ప బహుమతి.ఒక ఉపాధ్యాయుడు క్లాస్‌రూమ్‌లో విద్యార్థులపై కోపాన్ని నిగ్రహించుకుంటే, అతడు వందలాది మంది భావి భారత పౌరులకు ఆదర్శమూర్తి అవుతాడు. ఒక ప్రజా నాయకుడు వేదికలపై సంయమనం పాటిస్తే, అది లక్షలాది మంది అనుచరులకు క్రమశిక్షణను నేర్పుతుంది. ఒక గృహిణి కష్ట సమయాల్లో ప్రశాంతతను ఆశ్రయిస్తే, ఆ ఇల్లే ఒక నందనవనంగా మారుతుంది.క్షణికావేశాన్ని పూర్తిగా జయించడం అనేది రాత్రికి రాత్రే సాధ్యపడే మ్యాజిక్ కాదు. ఇది ఒక సుదీర్ఘమైన మానసిక సాధన, ఒక అద్భుతమైన అంతర ప్రయాణం. ప్రతిరోజూ ఉదయం నుండి రాత్రి వరకు మన మనసుతో మనం ఒక చిన్న యుద్ధాన్ని గెలవాల్సి ఉంటుంది. ఈ ప్రయాణంలో కొన్నిసార్లు మనం ఓడిపోవచ్చు, కోపానికి లొంగిపోవచ్చు. కానీ, పడిన ప్రతిసారీ తప్పును తెలుసుకుని మళ్లీ లేచి నిలబడాలి. ఆ పడిలేచే పట్టుదలే ఒక సామాన్యుడిని మహాత్ముడిగా తీర్చిదిద్దుతుంది.గుర్తుంచుకోండి మీరు ఆవేశపడినప్పుడు పరిస్థితులు మారకపోవచ్చు కానీ, ఆ ఆవేశం తెచ్చిపెట్టే ప్రమాదాల వల్ల మీ జీవిత గమనం ఖచ్చితంగా మారిపోతుంది. అదే మీరు ఆ ఒక్క నిమిషం ఆవేశాన్ని జయించగలిగితే, మీ అంతరంగమే కాదు, మీ చుట్టూ ఉన్న ప్రపంచం కూడా ఎంతో అందంగా, ప్రశాంతంగా మారుతుంది. క్షణికావేశం మీ శత్రువు కాదు అది మీ సహనానికి ప్రకృతే పెట్టే ఒక చిన్న పరీక్ష. ఆ పరీక్షలో నెగ్గి, మీ జీవితానికి మీరే నిజమైన విజేతగా నిలవండి!కోపాన్ని చంపడం కత్తితో కాదు ఒక్క క్షణం ఆగడంతోనే సాధ్యం!



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ఎడిటర్ వాయిస్

## కూటమి కలుపుకొని పోతే.. కూనదే హవా!

కూన రవి కుమార్. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ పేరు తెలియని వారు ఉండరు. ఇక, రాష్ట్ర వ్యాప్తంగా కూడా.. ఆయన పేరు ఇటీవల కాలంలో జోరుగానే వినిపిస్తోంది. గత ఎన్నికల్లో విజయం దక్కించుకున్న టీడీపీ సీనియర్ నేతగా.. ఆయన మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నించారు. కానీ, దక్కలేదు. దీంతో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ)లో చోటు కల్పించారు. దీంతో పాటు శ్రీకాకుళం జిల్లా క్రీడా రంగంలోనూ కీలక పోస్టు ఇచ్చారు. ఇక, రెండేళ్ల పాలనలో ఎమ్మెల్యేగా ఆయన తనదైన ముద్ర వేశారనే చెప్పాలి.

నియోజకవర్గంలో అందుబాటులో ఉండే నాయకుడిగా కూన పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు.. వైసీపీపై విమర్శలు చేయడంలోనూ.. పార్టీ వర్గాలను ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పెండింగులో ఉన్న పనులను పూర్తి చేస్తూ.. ప్రజలకు చేరువ అవుతున్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొనిపోతున్నారు. అయితే.. ఇదంతా.. ఆయనకు వచ్చే ఎన్నికలకు సంబంధించి ప్లాన్‌గా కొందరు చెబుతుంటే.. కాదు.. పోటీ పెరుగుతున్న దరిమిలా జాగ్రత్త పడుతున్నారని మరికొందరు చెబుతున్నారు.

ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే.. కూన రవి కుమార్... యువతను ఎక్కువగా ఆకర్షించేలా పనిచేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ్మినేని చిరంజీవి నాగ్ ఆముదాల వలసనుంచి పోటీ చేస్తారని తెలియడంతో ముందుగా నే అలెర్ట్ అవుతున్నారని సమాచారం. ఇది కూడా ఒకందుకు మంచిదే. అయితే.. లేనిదల్లా.. కూటమిలో సఖ్యత. కూన ఇతర కూటమి నాయకులతో సఖ్యతగా ఉండడం లేదని అంటున్నారు. అంతేకాదు.. ఎవరికి అందుబాటులో కూడా ఉండడం లేదని చెబుతున్నారు.

అభివృద్ధిపరంగా.. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం పరంగా ప్రజలకు చేరువ కావడంలో కూన బాగానే పనిచేస్తున్నారు. కానీ కూటమి నాయకులను కలుసుకునే విషయంలోను..కూటమిగా బలోపేతం అయ్యే విషయంలోనే ఆయన వెనుకబడుతున్నారన్నది ప్రధాన సమస్య. దీనిని కూన సరిచేసుకుంటే.. ఆయనకు మరింత బలం చేకూరుతుందని అంటున్నారు. మరి ఆయన ఈ సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తారో లేదో చూడాలి. రెండేళ్ల ఎమ్మెల్యేగా.. కూనకు మంచి మార్కులే పడుతున్నాయి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## నరసరావుపేటలో ఘోరం.. కరెంట్ షాక్‌తో కూలి మృతి



### పట్టించుకోని అధికారులు, యాజమాన్యం!

**రామచంద్రపురం రూరల్, నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన ఓ పేద కూలీ విద్యుత్ ఘాతానికి బలైన విషాద సంఘటన నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకుంది. ఓదురు గ్రామంలోని 17 చెరువుల వద్ద రోజువారీ కూలి పనికి వెళ్లిన మందపల్లి ఏసు (33) అనే యువకుడు శనివారం ఉదయం జనరేటర్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

**అనంతలోకాలకు కుటుంబ పెద్ద.. అనాథలైన పిల్లలు**

మృతుడు ఏసు నరసరావుపేట నివాసి. నిరుపేద కుటుంబానికి చెందిన ఏసుకు సొంత ఇల్లు కూడా లేదు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. ఏసుకు ఏడు సంవత్సరాల బాబు, కేవలం ఆరు నెలల వయసున్న పాప ఉన్నారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి అకస్మాత్తుగా మరణించడంతో ఆ పసిపిల్లలు, భార్య రోదనలు స్థానికులను కన్నీరు పెట్టించాయి. రామచంద్రపురం మండలం, ఓదురు గ్రామ పరిధిలోని 17 చెరువుల వద్ద జరుగుతున్న పనిలో భాగంగా ఈరోజు ఉదయం జనరేటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఏసు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.

**స్పందించని యాజమాన్యం.. రాని అధికారులు**

ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా సదరు పని యాజమాన్యం కానీ, కాంట్రాక్టర్ కానీ కనీసం స్పందించకపోవడంపై స్థానికులు, మృతుని బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందించినప్పటికీ స్థానిక వీఆర్వో, ఎమ్మార్వో లేదా గ్రామ పంచాయతీ అధికారులు ఎవరూ కూడా ఘటనా స్థలానికి చేరుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**న్యాయం చేయాలంటూ డిమాండ్**

సొంత ఇల్లు కూడా లేని అత్యంత పేద కుటుంబానికి చెందిన ఏసు మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, అలాగే యాజమాన్యం నుండి నష్టపరిహారం ఇప్పించి ఆ పసిపిల్లలను ఆదుకోవాలని గ్రామస్తులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాజోలు మండలంలో అనుమతి లేని

## అక్రమ లేఔట్లకు సోషల్ మీడియా టచ్...?

**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు మండల పరిధిలో అనుమతులు పొందని కొన్ని అక్రమ లేఔట్లకు సోషల్ మీడియా ఇన్ఫ్యూలెన్సర్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సన్నాహాలు సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే ప్లాట్లు ఆకర్షణియంగా చూపిస్తూ వీడియోలు, రీల్స్ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు విపరీతమైన చర్చ.. రాజోలు నియోజకవర్గం లో ఈ తరహా ప్రచారానికి నాంది పలికిన బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి.... ఈ ప్రాంతంలో ఇన్స్టాగ్రామ్ ఇన్ఫ్యూలన్సర్లను ఒకే వేదిక మీదికి తీసుకొచ్చి వారికి విందు భోజనాలు ఏర్పాటు చేసి.... వారికున్న ఫాలోవర్స్ స్థాయిని బట్టి బహుమతులు ఇచ్చి తాను చేస్తున్న వ్యాపారానికి విస్తృత ప్రచారం కల్పించాలంటూ అభ్యర్థించడం జరిగినట్లు ప్రచారం. ఆకర్షణీయ రీల్స్ చూసి పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత అధికారుల వద్ద పూర్తి వివరాలు తెలుసుకోవాలని పలువురు హెచ్చరిక.

**అయితే ఈ ప్రచారాల వెనుక అసలు నిజాలు ఏమిటి?**

అనుమతులు లేని వెంచర్లకు సోషల్ మీడియా స్టార్‌లతో గ్లామర్ టచ్ ఇస్తున్నారా? లేక ఇవన్నీ కేవలం ప్రచారమేనా? అనే విషయాలపై అధికారుల విచారణతోనే స్పష్టత వచ్చే అవకాశం.

## సనత్‌నగర్‌లో మహిళా పైలట్‌కు వేధింపులు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సనత్‌నగర్‌లో ఓ మహిళా పైలట్‌కు వేధింపుల ఘటన కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కల్ట్ జిమ్ ఫిట్‌నెస్ మేనేజర్ సంతోష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జిమ్ ట్రైనింగ్ పేరుతో తనను లోబర్చుకునేందుకు ప్రయత్నించాడని, ఒప్పుకోకపోవడంతో ఇన్‌స్టాలో తనపై అసభ్య మెసేజ్‌లు పెట్టారని మహిళా పైలట్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మేనేజర్ సంతోష్‌గౌడ్‌కు అతని గర్ల్ ఫ్రెండ్ రజనీ సహకరించిందని పోలీసులకు తెలిపారు.

## 18 నెలలపాటు నిఘా.. అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులను ఈగల్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 200 కిలోల గంజాయిని సీజ్ చేశారు. 104 ప్యాకెట్లలో గంజాయి, ఏడు మొబైల్ ఫోన్లు, రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.కోటి ఉంటుందని అంచనా. ఈ అంతర్రాష్ట్ర ముఠా కోసం ఈగల్ ఫోర్స్ పోలీసులు 18 నెలలపాటు నిఘా ఉంచారు. నిందితులు రెండు వాహనాల్లో గంజాయిని తరలిస్తుండగా.. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల సమీపంలో స్థానిక పోలీసుల సహకారంతో అడ్డగించారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. గంజాయి సరఫరా కోసం ముందస్తుగా రూ.1.90 లక్షలు బ్యాంక్ ఖాతాల ద్వారా చెల్లించారని, సరకు అప్పగించాక ఇద్దరు ప్రధాన నిందితులకు రూ.8 లక్షలు ఇవ్వాలని ఒప్పందం కుదిరిందని గుర్తించారు. ఈ కేసులో ప్రధాన ఫైనాన్షియర్ ప్రభు, సప్లయర్ దేవి సింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదం..

## 15 మందిపై సస్పెన్షన్ వేటు!



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైజాగ్ స్టీల్ ప్లాంట్లో ఇటీవల జరిగిన వరుస ప్రమాదాలపై యాజమాన్యం కఠిన చర్యలు చేపట్టింది. నాసిరకం ముడి పదార్థాల వాడకమే ప్రమాదాలకు కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో బాధ్యులైన ఎస్ఎంఎస్-1లో ఐదుగురు, ఎస్ఎంఎస్-2లో ఐదుగురు, ఆర్ఆడీలో ఐదుగురు మొత్తం 15 మందిని సస్పెండ్ చేయగా.. మరో 19 మందిని ఇతర విభాగాలకు బదిలీ చేసింది. త్వరలో మరికొంత మందిపై కూడా వేటు పడే అవకాశం ఉందని సమాచారం.

మైదుకూరు పట్టణంలో హత్య, దొంగతనాలలో నేరస్తులను

## అరెస్టు చేసిన పోలీసులు

### వివరాలు వెల్లడించిన మైదుకూరు డిఎస్పీ రాజేంద్రప్రసాద్



**మైదుకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మైదుకూరు పట్టణంలో హత్య, దొంగతనాలలో నేరస్తులను అరెస్టు చేసిన మైదుకూరు పోలీసులు. ఇందిరమ్మ కాలనీలో యువకుడు నాగేంద్ర హత్య కేసులో ముద్దాయి సుదర్శన్ రెడ్డిని మైదుకూరు డిఎస్పీ రాజేంద్రప్రసాద్ అరెస్ట్ చేశారు. ముద్దాయి తల్లి గురించి చెడుగా మాట్లాడుతున్నారని కారణంతో హత్య చేసినట్టు పోలీసు విచారణలో వెల్లడి. నిన్నటి దినం ఎర్ర చెరువు సమీపంలో అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన ఆయుధాన్నీ స్వాధీనం చేసుకున్న పోలీసులు. కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించిన పోలీసులు. ఆటో, ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసిన దొంగలు రాఘవేంద్ర ,షరీఫ్ లను అరెస్ట్ చేసిన పోలీసులు. వారి వద్ద నుండి ఆటో, ద్విచక్ర వాహనం స్వాధీనం వాటి విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందని తెలిపిన పోలీసులు. మైదుకూరు పట్టణం మహబూబ్నగర్లో దొంగతనానికి పాల్పడిన దొంగ అరెస్ట్. దొంగ గోవిందు నుండి 52 గ్రాముల బంగారు 175 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్న పోలీసులు. వీటిలో సుమారు ఎనిమిది లక్షలు ఉంటుందని తెలిపిన పోలీసులు. పలు దొంగతనం కేసుల్లో ముద్దాయి ఉన్నట్లు వివరణ..

## వెంచర్ మార్టిగేజ్‌కు రూ.లక్ష డిమాండ్

### లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కిన ఎంపీడీవో, ఎంపీవో



**నర్సింహులపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మహబూబాబాద్ జిల్లాలో ఓ వెంచర్ మార్టిగేజ్‌కు లంచం తీసుకుంటూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో), మండల పంచాయతీ అధికారి(ఎంపీవో)తో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన ఎంపీడీవో కుమారుడు అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన స్థిరాస్తి వ్యాపారి పుప్పాల సురేశ్ మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెం శివారు ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారికి దగ్గర్లో 4.20 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటుకు వరంగల్ ఆర్‌డీడీ కార్యాలయం నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. తమ భూములను కూడా ఈ వెంచర్‌లో కలుపుకొన్నారని, అనుమతి ఇవ్వొదని ఒకరు స్థానిక ఎంపీడీవో పెనుగొండ రాధిక, ఎంపీవో కిన్నెర యాకయ్యకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంచర్ నిర్వాహకుడు సర్వే చేయించి, కోర్టును ఆశ్రయించి అధికారులకు నోటీసులు పంపించారు. కోర్టు నోటీసులకు సమాధానం చెప్పడానికి, అనుమతులు ఇవ్వడానికి లంచం ఇవ్వాలని ఎంపీడీవో, ఎంపీవో డిమాండ్ చేశారు. ఎంపీడీవో కుమారుడు పెనుగొండ నాగార్జున మధ్యవర్తిత్వం చేసి రూ.లక్ష ఇచ్చేలా ఒప్పించగా తొలుత రూ.55 వేలు అందజేశారు. మిగతా డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు శుక్రవారం మిగిలిన రూ.45వేలు వెంచర్ నిర్వాహకుడు పుప్పాల సురేశ్‌కు ఇచ్చి పంపారు. మధ్యవర్తి నాగార్జున సమక్షంలో ఎంపీడీవో రాధికకు రూ.25వేలు, ఎంపీవో యాకయ్యకు రూ.20 వేలు ఇస్తుండగా అనిశా అధికారులు వారిని అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన అనంతరం బాధితులు ఎంపీడీవో కార్యాలయ కూడలిలో బాణసంచా కాల్చారు.

# కిసాన్ వాయిస్

## నమో డ్రోన్ దీదీ స్కీమ్ గురించి తెలుసా?

**మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్ల పంపిణీతో సేద్యానికి టెక్నాలజీ దన్ను**

**వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలకు, జీవనోపాధి మెరుగుదలకు దోహదం**

గత రెండు దశాబ్దాల్లో డ్రోన్ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా ఒక శక్తిమంతమైన సాధనంగా ఎదిగింది. మన దేశం కూడా ఈ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తోంది. వ్యవసాయం, పాలన, అభివృద్ధి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని వేగంగా విస్తరిస్తోంది. తొలుత ప్రయోగాత్మకంగా డ్రోన్ల వాడకం చిన్నగా ప్రారంభమైనా ఇప్పుడు ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయాల నిర్వహణ, వ్యవసాయం, జాతీయ భద్రత వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే స్థాయికి చేరుకుంది. నమో డ్రోన్ దీదీ కార్యక్రమం కింద 1,094 డ్రోన్‌లను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించారు. ఇది వ్యవసాయ ఉత్పాదకతను, జీవనోపాధిని మెరుగుపరుస్తోంది. న్యూఢిల్లీలో ఏఐ సమ్మిట్ జరుగుతున్న సందర్భంగా డ్రోన్ల హవాపై ఫోకస్...

మన దేశంలో ప్రస్తుతం ఆధునిక వ్యవసాయంతో పాటు భూమి, ఆస్తి సర్వేలు, మౌలిక సదుపాయాల తనిఖీ, విపత్తు నిర్వహణ, రైల్వే, హైవేల పర్యవేక్షణ వంటి పనుల కోసం డ్రోన్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. డ్రోన్ల తయారీదారులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, శిక్షణ సంస్థలు, అంకుర సంస్థలు, పరిశోధన సంస్థలు, ధ్రువీకృత పైలట్‌ల కృషితో డ్రోన్ల వినియోగం ప్రభుత్వ నిబంధనలకు లోబడి నానాటికీ విస్తరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం.. ఫిబ్రవరి 2026 నాటికి దేశంలో 38,500కు పైగా నమోదిత డ్రోన్‌లు(యూఐఎన్) వాడుకలో ఉన్నాయి. 39,890 డీజీసీఏ-ధ్రువీకృత పైలట్లు సేవలందిస్తున్నారు. 244 శిక్షణా సంస్థలు డ్రోన్ సంబంధిత నైపుణ్యాలను అందిస్తున్నాయి. స్వమిత్వ పథకం కింద డ్రోన్‌లను ఉపయోగించి 3.28 లక్షల గ్రామాలను సర్వే చేశారు. 31 రాష్ట్రాల్లోని 1.82 లక్షల గ్రామాలకు సంబంధించి 2.76 కోట్ల ఆస్తి కార్డులను రూపొందించారు. సరళీకృత విధాన నిర్ణయాలు డ్రోన్ వ్యవస్థ విస్తరణకు దోహదపడుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల వల్ల ఈ రంగం ఇంతగా అభివృద్ధి చెందింది. సరళీకృతమైన డ్రోన్ నియమాలు, 'డిజిటల్ స్కై' సింగిల్ విండో ప్లాట్‌ఫారమ్, తయారీదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలు, లక్షిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, డ్రోన్ వినియోగాన్ని సామాన్యులకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చాయి. ప్రభుత్వ పథకాల్లో డ్రోన్‌లను చేర్చడం వల్ల పనులు మరింత వేగంగా, పారదర్శకగా జరుగుతున్నాయి.

**నమో డ్రోన్ దీదీ సేవలు**

నవంబర్ 2023లో ప్రారంభించిన 'నమో డ్రోన్ దీదీ' కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం. ఆధునిక వ్యవసాయ పద్ధతులకు మద్దతుగా మహిళా స్వయం సహాయక సంఘాలకు(ఎస్‌హెచ్‌జీ) డ్రోన్లను అందించడం ఈ పథకం లక్ష్యం. వ్యవసాయ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, పంట ఉత్పాదకతను పెంచడం, పెట్టుబడి ఖర్చులను తగ్గించడం, మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించడం దీని ప్రధాన ఉద్దేశ్యాలు. డ్రోన్ దీదీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ప్రముఖ ఎరువుల కంపెనీల ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు 1,094 డ్రోన్లు పంపిణీ అయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో నమో డ్రోన్ దీదీ పథకం కింద అందించినవి 500కు పైగా డ్రోన్లు ఉన్నాయి. నమో డ్రోన్ దీదీ పథకం శ్రమతో కూడిన పాత పిచికారీ పద్ధతులకు స్వస్తి చెప్పి.. కచ్చితమైన ఫలితాలు సాధించే కృషి దిశగా వ్యవసాయంలో గణనీయమైన మార్పునకు శ్రీకారం చుట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌కు చెందిన ఒక డ్రోన్




దీదీ మాట్లాడుతూ డ్రోన్ శిక్షణ తనను శక్తివంతం చేసిందన్నారు. స్వయం సహాయక సంఘం తరఫున నానో ఎరువులు, పురుగు మందుల పిచికారీ సేవలను అందిస్తూ ఆదాయం పొందుతున్నానని వివరించారు.

**డ్రోన్ల నిబంధనలు మీకు తెలుసా?**

దేశంలో డ్రోన్ల వినియోగం వేగవంతంగా విస్తరిస్తోంది. డ్రోన్ల తయారీ, వినియోగాన్ని వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర విధానపరమైన, ఆర్థిక చట్రాన్ని ఏర్పాటు చేసింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, నిబంధనల అమలును సులభతరం చేయడానికి, స్వదేశీ డ్రోన్ల ఉత్పత్తిని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంది.

డ్రోన్ రూల్స్ 2021ను 2022, 2023లలో సవరించారు. ఈ సవరణలు మన దేశ డ్రోన్ వ్యవస్థను సరళీకరించాయి.

నియంత్రణ విధానాలు సులభతరమయ్యాయి. ఫారమ్‌ల సంఖ్యను 25 నుంచి 5కి తగ్గించారు. అనుమతుల అవసరాలను 72 నుంచి కేవలం 4కు తగ్గించారు.

ఫీజుల హేతుబద్ధీకరణ జరిగింది. డ్రోన్ పరిమాణంతో సంబంధం లేకుండా ఫీజుల నిర్ణయం జరిగింది.

పౌర డ్రోన్ కార్యకలాపాల్లో 500 కేజీల బరువు వరకు ఉన్న డ్రోన్ల వాడకానికి అనుమతి లభించటంతో వాణిజ్య, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగం పెరిగింది.

గగనతలంలో దాదాపు 90%ను గ్రీన్ జోన్‌గా ప్రకటించారు. 400 అడుగుల ఎత్తు వరకు డ్రోన్లను ప్రభుత్వం అనుమతిస్తున్నది.

'సాంప్రదాయ పైలట్ లైసెన్స్‌కు బదులుగా డీజీసీఏ జారీ చేసే 'రిమోట్ పైలట్ సర్టిఫికేట్'ను ప్రవేశపెట్టారు.

పాస్‌పోర్ట్ అవసరం లేదు. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఐడీ, అడ్రస్ ప్రూఫ్ ఉంటే డ్రోన్లను నడపడానికి సరిపోతుంది.

మొత్తంగా ఈ సంస్కరణలు డ్రోన్ రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి గల అడ్డంకులను గణనీయంగా తగ్గించాయి. డ్రోన్ సేవల అందుబాటును గ్రామాల్లో పెంచడానికి దోహదపడుతున్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

డ్రోన్లు, డ్రోన్ విడిభాగాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించటానికి పీఎల్ఐ పథకానికి కేంద్రం రూ.120 కోట్లు కేటాయించింది. అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, దేశీయ డ్రోన్ తయారీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ పథకం వీలు కల్పిస్తోంది.

సెప్టెంబర్ 2025లో డ్రోన్లపై జీఎస్టీని ఏకరీతిగా 5 శాతానికి తగ్గించారు. అంతకుముందు 18%, 28% పన్ను రేట్లు ఉండేవి.


డ్రోన్ రిజిస్ట్రేషన్, రిమోట్ పైలట్ సర్టిఫికేషన్, టైప్ సర్టిఫికేషన్, ఆర్టీపీఓ అధికారాల వంటి నియంత్రణ సేవలు డిజిటల్ స్కై ప్లాట్‌ఫారమ్ నుంచి ఈజీసీఏకి మార్చారు. విమాన ప్రణాళిక, ఎయిర్‌స్పేస్ మ్యాప్ వంటి కార్యాచరణ సేవలు డిజిటల్ స్కై ప్లాట్‌ఫారమ్‌తో అనుసంధానితమై కొనసాగుతున్నాయి. మన దేశంలో డ్రోన్ వ్యవస్థ పైలట్ ప్రాజెక్టుల స్థాయి నుంచి ఆవిష్కరణ--ఆధారిత ప్రధాన స్రవంతి రంగంగా ఎదిగింది. మహిళా సాధికారత, గ్రామీణ సదుపాయాలు, దేశీయ తయారీకి మద్దతు ఇచ్చే కార్యక్రమాలతో ప్రభుత్వం సాంకేతిక ఆవిష్కరణలను, విస్తృత డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. డ్రోన్లు ఇప్పుడు వ్యవసాయం, భూమి, ఆస్తి సర్వేలు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, విపత్తు అంచనా, పౌర సేవల పంపిణీ వంటి కీలక రంగాలలో భాగమయ్యాయి.

**పంట నష్టాల సేకరణ సులువు**

దేశంలో అనేక రంగాల్లో డ్రోన్లు వివిధ రంగాలలో సామాజిక--ఆర్థిక అభివృద్ధి ఫలితాలను అందిస్తున్నాయి. వ్యవసాయంలో వీటి వినియోగం మహిళా రైతులకు సాధికారత కల్పించడమే కాకుండా పంట నష్టాల అంచనా పనులను మెరుగుపరిచింది. మౌలిక సదుపాయాలు, పట్టణ ప్రణాళికలో ఇవి చురుకైన పర్యవేక్షణ, మెరుగైన వనరుల నిర్వహణకు వీలు కల్పించాయి.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
ఆదివారం, 14 జూన్, 2026

www.viswamvoice.com



# బైక్ ర్యాలీ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు : ఎమ్మెల్సీ తోట

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేటలో నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన వైసీపీ కుటుంబ సభ్యులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు తెలిపారు. మండపేట వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎవ్వరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోయినా తనపైనా, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పైనా ఉన్న అభిమానంతో వేలాది మంది స్వచ్ఛందంగా తరలి రావడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. గత ఎన్నికల్లో తాను నామినేషన్ దాఖలు చేసిన సమయంలో




మాత్రమే ఇంత పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారని పేర్కొన్నారు. యువత సొంతంగా పెట్రోలు ఖర్చు పెట్టుకుని బైక్‌లపై వచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి కేవలం పార్టీ శ్రేణులే కాకుండా పార్టీ కానివారూ, రాజకీయాలకు అతీతంగా ఉన్న ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరుకావడం విశేషమన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో నిన్న నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమమే నిదర్శనమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఈ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయని చెప్పారు. తనపై చూపించిన అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. తనను ఆదరించిన ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుని వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. ఈ సమావేశం లో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడు, పార్టీ సీనియర్ నాయకులు మాజీ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, కౌన్సిల్ మాజీ విప్ పోతంశెట్టి వర ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ముమ్మిడివరపు బాపిరాజు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మేడిశెట్టి దుర్గారావు, ఆంజనేయస్వామి దేవస్థానం ధర్మ కర్తల మండల మాజీ చైర్మన్ సూరంపూడి సత్య ప్రసాద్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, కేశవరం గ్రామ నాయకుడు గంధం సూరిబాబు పాల్గొన్నారు.

### మాతృశ్రీ అంకాలమ్మకు

# కంబాల లక్ష రూపాయలు విరాళం

**రామసేన ఆధ్వర్యంలో అంకాలమ్మకు ప్రత్యేక పూజలు**



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కాపవరం గ్రామదేవత మాతృశ్రీ అంకాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించి, జాతర ముగింపు సందర్భంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహాయ సహకారాలతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. శనివారం కాపవరం గ్రామ దేవత మాతృశ్రీ అంకాలమ్మ జాతర ముగింపు సందర్భంగా విశ్వ హిందు ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రామసేన సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు పంపించిన లక్షరూపాయల చెక్కును, ఆలయ కమిటీసభ్యులకు అన్న వితరణ నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. సందర్భంగా రామసేన సభ్యులు మాట్లాడుతూ విశ్వ హిందు ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు కంబాల ప్రస్తుతం అందుబాటులో లేకున్నా రాజానగరం, జగ్గంపేట, ఏజెన్సీ రంపచోడవరం నియోజకవర్గలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రజా సేవా కార్యక్రమాలు ఎల్లవేళలా జోరుగా కొనసాగుతాయన్నారు. హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రజా సేవా కార్యక్రమాలు కంబాల పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారన్నారు. రామసేన సభ్యులకు, అంకాలమ్మ కమిటీసభ్యులు పూలమాలవేసి సాల్వతో ఘనంగా సత్కరించి, కంబాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో రామసేన సభ్యులు పెద్దాడ వెంకన్న దొర, ఉంగరాల మణిరత్నం, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, నాగా రమేష్ వీరాంజలి, రాయపాటి సత్యనారాయణ, బత్తిన వీరాంజనేయులు, ఆలయ కమిటీసభ్యులు కోడినాగుల ప్రసాద్, భావన వెంకట్రాజు, నల్లల హరిబాబు, రెడ్నశీ బుల్లిరాంబాబు, నల్లల రాజు, సీతాదేవి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో

# ఆదిత్య వాలంటీర్ల రక్తదానం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీతో పాటు రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు 72 యూనిట్ల రక్తాన్నిదానం చేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాల గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు మహిళా రాజమహేంద్రవరం అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, ప్రిన్సిపాల్ ఎస్.కె.ఎన్. రెహమాన్ రక్తదాతల దినోత్సవ ర్యాలీని ప్రారంభించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా షెల్టన్ వరకు సాగిన ర్యాలీ ద్వారా రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ లక్ష్మి సరోజ ప్రారంభించారు. శిబిరంలో 56 మంది ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కోసూరి చండీప్రియ మాట్లాడుతూ, సమాజ సేవ రక్తదానం వంటి కార్యక్రమాల్లో ఆదిత్య విద్యాసంస్థలు ఎప్పుడూ ముందుంటాయని అభినందించారు. యూత్ రెడ్ క్రాస్ ప్రతినిధులు మహాలక్ష్మి, డాక్టర్ బళ్ల శ్రీనివాస్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు కె.సుధాకర్ పట్నాయక్, అజాద్ రాజు రక్తదాతలను అభినందించారు. డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ 2002 నుంచి ఆదిత్య వాలంటీర్లు నిరంతరంగా రక్తదానం చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ జి.వి.ఎస్. నాగేశ్వరరావు ఇప్పటికే 72 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి షేక్ నజీరుద్దీన్ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది డాక్టర్ జి.వి.ఎస్. నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నూతన తహసీల్దార్‌ను కలిసిన

# ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, యువజన సంఘం నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవలే జిల్లాలో జరిగిన తహసీల్దార్ల బదిలీలలో భాగంగా రాజమండ్రి అర్బన్ కు నూతన ఎమ్మార్వోగా పదవి బాధ్యతలు స్వీకరించిన యు. రంజిత్ కుమార్‌ను జిల్లా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల అధ్యక్షులు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎమ్మార్వో రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాజమండ్రి అర్బన్ మండలంలో శక్తి వంచన లేకుండా తాను పూర్తిస్థాయిలో సేవలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘం అధ్యక్షులు కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఎస్సీ ఎస్టీ,బి.సి లకు కావలసిన సర్టిఫికెట్లన్నీ సకాలంలో అందించాలని కోరారు. ప్రతినెలా పౌరుల హక్కులదినోత్సవం విజయవంతంగా జరిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగ నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, ఎలిపే శ్రీనివాస్, ఉసురుమర్తి రామారావు, పోస్టల్ సువర్ణ రాజ బరుగుల రత్నం, అశోకు ఎస్సీ ఎస్టీ యూత్ నాయకులు జంగం సుబ్బారావు, గార అప్పారావు,గారా త్రినాథ్, ఉల్లం రవి, వలూరి రాజేష్,వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

### జస్టిస్ బాలకృష్ణ కమిషన్‌కు

# కాలపరిధి పొడిగింపుపై ఆస్క్ హర్షం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్సీ,ఎస్టీ క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్లు వర్తింప చేయాలన్న అధ్యయన కమిటీ కాలపరిధి మరో 10 రోజులు పొడిగించడం పట్ల అంబేద్కర్ సేవా కేంద్రం ఆస్క్ చైర్మన్ లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. 2022లో జస్టిస్ బాలకృష్ణ కమిషన్ సుమారు నాలుగు సంవత్సరాల పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ ఎస్టీ ప్రతినిధుల నుండి సంఘాల నుండి వినతి పత్రాలు స్వీకరించి సమావేశాలు పెట్టి కమిషన్ దేశవ్యాప్తంగా సమాచారం సేకరించిందన్నారు. ఈ మేరకు జూన్ 10తో కమిషన్ పదవీకాలం ముగిసింది. అయితే జూన్ 10న అంబేద్కర్ సేవా కేంద్రం చైర్మన్ లైన్ గుబ్బల రాంబాబు నాయకత్వంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా బాధ్యులు ఇసుకపట్ల ఇమ్మాన్యుయేల్ కుమార్ తో కూడిన ప్రతినిధి బృందం జస్టిస్ బాలకృష్ణ కమిషన్ కలిసి కమిషన్ పదవీ కాలాన్ని పొడిగించాలని వినతి పత్రం సమర్పించింది. అలాగే పత్రికల ద్వారా కమిషన్ పదవి కాలాన్ని మరికొన్ని రోజులు పొడిగించాలని డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళింది. ఈ మేరకు కమిషన్ సమీక్షకాలం మరో 10 రోజులు పొడిగించడం పట్ల ఆస్క్ చైర్మన్ రాంబాబు హర్షం వ్యక్తం చేశారు .తమ వినతిని పరిగణలోకి తీసుకుని కమిషన్ కాల పరిధిని పది రోజులు పొడిగించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అంబేద్కర్ వాదులు అందరూ మరిన్ని వినతి పత్రాలు సమర్పించి సమస్య తీవ్రతను కమిషన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ముందుకు రావాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రవచించిన మేరకు వ్యవస్థలు అనుకూలంగా లేనప్పుడు (ప్రెషర్ పాలిటిక్స్) ఒత్తిడితో కూడిన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వానికి మన నిరసనలు తెలియజేసేందుకు ఎస్సీ ఎస్టీ అంబేద్కర్ వాదులందరూ ఈ ప్రయత్నంలో భాగస్వామ్యం కావలసిందిగా రాంబాబు విజ్ఞప్తి చేశారు. కమిషన్ పదవీకాలం పొడిగించినందుకు కేంద్ర ప్రభుత్వానికి రాంబాబు ఆస్క్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

### జాతీయ రహదారి 516-ఇ

# ప్రమాదాల నివారణకు చర్యలు : సీఐ మూర్తి

**రోడ్ల పక్క వాహనాలు నిలిపిన, రాంగ్ పార్కింగ్‌లకు కఠిన చర్యలు**



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో రాజమండ్రి మీదుగా భద్రాచలం, జగదల్ పూర్, అరకు వెళ్ళే జాతీయ రహదారి(516-ఇ) మార్గంలో ప్రమాదాలు జరగకుండా ప్రతిష్ట చర్యలు చేపడుతున్నట్లు కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వివి సత్యనారాయణమూర్తి తెలిపారు. శనివారం ఆయన కాపవరం రుడా కొత్తగుంటపార్కు వద్ద ప్రమాదాలకు నిలయ మవుతున్న ప్రాంతాన్ని గుర్తించి,ఇసుక డ్రమ్ముల పై రేడియం స్టిక్కర్లు అతికించి ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ జాతీయ రహదారి 516-ఇ మీదుగా రాజమహేంద్రవరం నుండి భద్రాచలం, జగదాల్ పూర్, అటవీప్రాంత ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి అరకు, బొర్రా గృహాలు వంటి ప్రదేశాలను తిలకించడానికి టూరిస్టులు ఎక్కువగా రావడంతో ట్రాఫిక్ బాగా పెరిగిందన్నారు.మధురపూడి విమానాశ్రయానికి విఐపిల తాకిడి ఎక్కువైందన్నారు. దీనికి తోడు అతి దగ్గరలోనే హెచ్పీసీఎల్, ఐఓసీఎల్, గ్యాస్ కంపెనీ ఉండడంతో లారీలు సంఖ్య విపరీతంగా పెరగడం, అదేవిధంగా మండలంలో మైనింగ్, ఇసుక, క్వారీల లారీలు విపరీతంగా తిరుగుతున్నాయన్నారు. దీంతో గత మాసంలో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, ఉత్తర మండల డిఎస్పి జీవన ఆదేశాల మేరకు ప్రమాదాలు నివారించడానికి కోరుకొండ మండలంలో ఎనిమిది ప్రాంతాలు, గోకవరం మండలంలో పది ప్రాంతాలు, సీతానగరం మండలంలో ఐదు ప్రాంతాలను గుర్తించమని, ఆయా ప్రాంతాల్లో డ్రమ్ముల్లో ఇసుక నింపి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశామని తద్వారా ప్రమాదాలు నివారించవచ్చు అన్నారు. దీనితో వాహనాల వేగానికి బ్రేక్ పడుతుందన్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పాఠశాలల వద్ద వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు, రేడియం సైన్ బోర్డులు ఏర్పాటు చేయడానికి నేషనల్ హైవే అథారిటీ అనుమతులు తీసుకోమన్నా మన్నారు. వాహనదారులు రాంగ్ పార్కింగ్ చేసిన, ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలను నిలుపుదల చేసిన వాహనదారుల పై కేసులు నమోదు చేసి, కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట రమేష్, పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### భద్రతా ప్రమాణాలు నిర్ధారణ


# అనంతరమే బోట్లకు అనుమతి

**పోశమ్మ గండి నుండి గోదావరి నదిలో పర్యాటక బోట్ల సేవలు తాత్కాలికంగా నిలిపివేత : ఆర్డీవో కె.స్వాతి**





**రంపచోడవరం/దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి నదిలో నిర్వహిస్తున్న పర్యాటక బోట్ల నిర్వహణ తీరుపై పలు ఆరోపణలు, భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా పర్యాటక బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రంపచోడవరం డివిజన్ పరిధిలో గల గోదావరి నదిలో నడుస్తున్న అన్ని పర్యాటక బోట్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. బోట్ల ఫిట్‌నెస్, సాంకేతిక పరిస్థితి, ప్రయాణికుల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, లైఫ్ జాకెట్లు, అత్యవసర రక్షణ పరికరాలు, బోట్ యాజమాన్యాలు పర్యాటకుల భద్రత కోసం తీసుకున్న చర్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, పోలీసు, పర్యాటక, మత్స్యశాఖ, విపత్తు నిర్వహణ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కూడిన సంయుక్త బృందం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. బృందం నివేదిక ఆధారంగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారణ అయిన అనంతరమే సంబంధిత బోట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని, తనిఖీలు పూర్తయ్యే వరకు గోదావరి నదిలో పర్యాటక బోట్లను నడపరాదని బోట్ యాజమాన్యాలను ఆర్డీవో స్వాతి హెచ్చరించారు. భద్రతా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.





# వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలే ముఖ్యం

## యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం : జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నిదియా దేవి



**అమలాపురం విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో ఉత్తమమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం యోగా ద్వారా సాధ్యమవుతుందని కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి అన్నారు. అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం-2026 వేడుకల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాల్లో భాగంగా శనివారం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో పండుగ వాతావరణంలో భారీ సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది "వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించాలి" అనే ఇతివృత్తంతో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యం మెరుగుపడి అనారోగ్యాల బారిన పడే అవకాశాలు తగ్గుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ నెలలో కనీసం 15 రోజుల పాటు యోగా సాధన చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగా ఆరోగ్యవంతమైన జీవనానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. కోనసీమ జిల్లా ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిరోజూ యోగాతోనే తన దినచర్యను ప్రారంభిస్తారని, ఆయన ఆరోగ్యంగా, చురుకుగా ఉండటానికి యోగానే ప్రధాన కారణమని చెప్పారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ప్రపంచవ్యాప్తంగా దాని ప్రాధాన్యతను చాటిచెబుతున్నారని తెలిపారు. వయస్సు పెరిగినా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని, క్రమం తప్పకుండా యోగా చేస్తే ఉత్సాహం, ఏకాగ్రత, పనితీరు మెరుగుపడతాయని అన్నారు. కనీసం 15 రోజుల పాటు నిరంతరంగా యోగా సాధన చేస్తే అది అలవాటుగా మారుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, ప్రతి ఇంట్లోనూ యోగా సాధన చేసే అలవాటు పెంపొందించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వరుసగా రెండో సంవత్సరం కూడా యోగాంధ్ర కార్యక్రమాన్ని అదే ఉత్సాహంతో కొనసాగిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణలో వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేలా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు యోగా అత్యుత్తమ సాధనమని ప్రభుత్వం గుర్తించి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతిరోజూ యోగా చేసే వారు మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి నాన్-కమ్యూనికేబుల్ వ్యాధులకు దూరంగా ఉండగలరని తెలిపారు. ఈ సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన వి. సాత్విక అద్భుతమైన యోగా నృత్య ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు. ప్రత్యేక యోగా విన్యాసాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో యోగా టీచర్ సి. సెంటర్ శేఖర్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి. సత్యనారాయణ, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ హుస్సేన్, డీఆర్‌డీఏ పీడీ డి. రాంబాబు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్యాంసుందర్, డీఎల్‌డీవో వేణుగోపాల్, ప్రభుత్వ ఉద్యోగులు, యోగా శిక్షకులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

### 29 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలు, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అండగా నిలిచే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన మొత్తం 29 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప వరమని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అందులో భాగంగానే శనివారం పెద్ద ఎత్తున చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. నిరుపేదల ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులోనూ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆపత్కాలంలో తమకు ఆర్థిక సహాయం అందించినందుకు చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ దరఖాస్తులపై ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు త్వరగా మంజూరయ్యేలా కృషి చేసిన ఎమ్మెల్యే ఆనందరావుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ద్రాక్షారామంలో బిజెపి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం

### సంస్థాగత బలోపేతం, ఓటర్ల సర్వేపై దిశానిర్దేశం



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలో నియోజకవర్గ బి.ఎల్.ఏ-1 ఇంచార్జి సలాది శేఖర్ అధ్యక్షతన బిజెపి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా బిజెపి ఇంచార్జి ఎస్.ఐ.ఆర్ జిల్లా కన్వీనర్ తమనంపూడి రామకృష్ణా రెడ్డి, అలాగే అనకాపల్లి బిజెపి జిల్లా ఇంచార్జి కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు. సమావేశంలో కర్రి చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మరొక ముఖ్య అతిథి తమనంపూడి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరగబోయే సమగ్ర ఎన్నికల సర్వే ప్రక్రియ గురించి వివరించారు. బిజెపి తరపున ఉన్న బి.ఎల్.ఏ-2 ఇన్చార్జీలు కూడా అధికారులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ఈ సర్వే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఓటు హక్కు అనేది మనందరి ప్రాథమిక హక్కు అని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గుర్తుచేశారు. ఈ సమగ్ర సర్వే ద్వారా మన ప్రాంతానికి ఇతర దేశాల నుంచి వలస వచ్చిన వారిని ఇప్పటివరకు ఆధార్ లేని వారిని డేటాకు లింక్ అవ్వని వారిని గుర్తించే ప్రక్రియను ఎన్నికల సంఘం చేపడుతోందని తెలిపారు. ఈ సర్వే దేశ భద్రతకు ఎంతో కీలకమని, వార్డులలో ఉండే సంఘ వ్యతిరేక శక్తులను ఏరివేయడంలో భారత ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. అలాగే ఓటర్ల వివరాలను మ్యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి కూడా ఈ సమగ్ర సర్వే ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఈ కీలక సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, జిల్లా యువమోర్చా అధ్యక్షులు గానాల కళ్యాణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబులతో పాటు నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల బిజెపి అధ్యక్షులు, ఇంచార్జీలు, వివిధ మోర్చాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై

# వైసిపి నేతల విమర్శలు తగవు

### రామచంద్రపురం సువార్తపేట లెప్రసీ కాలనీ వాసుల హితవు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర కార్మిక, వైద్య బీమా సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యంలపై వైసిపి నాయకులు చేస్తున్న విమర్శలు ఎంతమాత్రం తగవని స్థానిక సువార్తపేట లెప్రసీ కాలనీ వాసులు స్పష్టం చేశారు. శనివారం రామచంద్రపురం పట్టణంలోని సువార్తపేట వద్ద లెప్రసీ కాలనీకి చెందిన పెద్దలు, మహిళలు మీడియాతో మాట్లాడారు. తమ కాలనీలోని ప్రధాన సమస్యలను మంత్రి సుభాష్ ఆయన తండ్రి సత్యంల దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాలనీవాసులు నడిచేందుకు వీలుగా తక్షణమే ర్యాంపులు వేయించారని అలాగే వర్షాలకు ఇళ్ల స్లాబులు లీక్ అవుతున్న విషయాన్ని చెబితే వెంటనే రిపేర్ పనులు చేయించి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. తమకు ఎల్లప్పుడూ అండగా నిలిచే మంత్రి కుటుంబానికి తామెంతో రుణపడి ఉంటామని కాలనీవాసులు ఈ సందర్భంగా భావోద్వేగంతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకుడు రెడ్డి సురేష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో మంత్రి సుభాష్ తన సొంత ధనాన్ని వెచ్చిస్తూ పేదలను అన్ని విధాలా ఆదుకుంటున్నారని కొనియాడారు. సొంత డబ్బు ఖర్చు పెట్టి ఇంతలా ప్రజాసేవ చేసే నాయకులను తాను ఎక్కడా చూడలేదని ఎందరో పేద విద్యార్థుల చదువులకు, నిరుపేదల వైద్యానికి ఆర్థిక సహాయం అందిస్తూ ఉదారత చాటుకుంటున్న ప్రజా నాయకుడిపై అవినీతిపరులంటూ వైసిపి నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న క్షేత్రస్థాయి అభివృద్ధిని చూసి వైసిపి నాయకులు మాట్లాడాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ కాలనీ పెద్దలు కడియాల చందర్రావు నాయుడు, కాలనీ నివాసితులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లి సూర్యప్రకాష్‌పై టిడిపి శ్రేణుల

# అనుచిత వ్యాఖ్యలు దురదృష్టకరం

### వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తీవ్ర ఖండన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా నిన్న నిర్వహించిన "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమం రామచంద్రపురం నియోజకవర్గంలో ఊహించిన దానికంటే ఘన విజయం సాధించడాన్ని జీర్ణించుకోలేక, కొందరు టిడిపి కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర బాధాకరమని వైసిపి శ్రేణులు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈరోజు మీడియా సమక్షంలో సమావేశమై ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలు ఎప్పుడైనా హుందాగా ఉండాలని వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి మంచిది కాదని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం మండలం కన్వీనర్ పోలినాటి వరప్రసాద్, రేవు నాగేశ్వరరావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు యనమదుల శ్రీను, బొమ్ము మోహన్‌రావు, కాటే ఏడుకొండలు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీనులు ప్రసంగిస్తూ టిడిపి నేతల తీరుపై మండిపడ్డారు. ఈ ఖండన సమావేశంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్య బంగారు బాబు, రామచంద్రపురం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంటపల్లి రామకృష్ణ, మాజీ సర్పంచ్ పంపన వెంకటరమణ, దొంగ సాయిబాబా, పిల్లి రాంబాబు, పిల్లి భీమేశ్వరరావులతో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పిల్లి సూర్యప్రకాశ్‌కి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

నరసరావుపేటలో

# విద్యుత్ షాక్‌తో కూలి మృతి

### బాధిత కుటుంబానికి పరిహారం అందజేత, వివాదం సుఖాంతం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రూరల్ నరసరావుపేట పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఓ విషాద సంఘటనలో ఓదురు గ్రామంలోని 17 చెరువుల వద్ద కూలి పనికి వెళ్లిన మందపల్లి ఏసు (33) అనే యువకుడు జనరేటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఏసుకు భార్యతో పాటు ఏడేళ్ల బాబు, ఆరు నెలల పసిపాప ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న పెద్ద దిక్కు అకస్మాత్తుగా మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అటు ప్రభుత్వ అధికారులు, ఇటు సదరు పని యాజమాన్యం మరియు కాంట్రాక్టర్లు తక్షణమే స్పందించారు. బాధిత కుటుంబ పరిస్థితిని గమనించిన అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం విషయమై చర్చలు జరిపారు. అనంతరం ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిరి బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయాన్ని అందించి సెటిల్మెంట్ పూర్తి చేశారు. యాజమాన్యం నుండి తక్షణమే నష్టపరిహారం అందడం, అధికారులు సానుకూలంగా స్పందించి ఆ పసిపిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించడంతో ఈ వివాదం సుఖాంతమైంది.

వెంకటాయపాలెంలో ఎన్‌డీఏ కూటమి

# ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ

### భారీగా తరలిరావాలని పిలుపు

**రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రామచంద్రపురం నియోజకవర్గ స్థాయి విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 15వ తేదీ సోమవారం మధ్యాహ్నం 03:00 గంటల నుండి వెంకటాయపాలెంలోని పేపకాయల బాబ్జీ గారి కల్యాణ మండపంలో ఈ ప్రత్యేక సమావేశం జరగనుంది. ఈ నియోజకవర్గ స్థాయి విజయోత్సవ సభకు రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని కూటమి ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, తెలుగు మహిళలు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు మరియు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామచంద్రపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చాయి.

# కే.గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

### ప్రధానోపాధ్యాయులు జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం హర్షం



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కే.గంగవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ట్రిబుల్ ఐటీలో ప్రవేశాలు సాధించారు. ఈరోజు విడుదలైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఫలితాలలో పాఠశాలకు చెందిన చెల్లి మహాలక్ష్మి, పైడికొండల రాజేశ్వరి శ్రీకాకుళం క్యాంపస్‌లో అడ్మిషన్లు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సరైన దిశానిర్దేశం ఉంటే తమ కృషి, పట్టుదలతో ఇలాంటి ఉన్నత అవకాశాలను సులువుగా అందిపుచ్చుకోగలరని నిరూపించారని పేర్కొన్నారు. ఈ ఇద్దరు విద్యార్థినులు సాధించిన విజయం పాఠశాల కీర్తి ప్రతిష్టలను పెంచడమే కాకుండా తోటి విద్యార్థులకు సైతం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల నుండి ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ఘన విజయానికి వెనుక ఉండి విద్యార్థినులను నిరంతరం ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు మరియు వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు.

# హద్దుమీరి మాట్లాడితే ఇళ్లు ముట్టడిస్తాం : వైసిపి ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్‌కు కూటమి నేతల తీవ్ర హెచ్చరిక

**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్.. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ మరియు వాసంశెట్టి సత్యంలపై చేస్తున్న వ్యక్తిగత విమర్శలను తక్షణమే మానుకోవాలని లేనిపక్షంలో వైసిపి కార్యాలయాన్ని, వారి ఇంటిని ముట్టడిస్తామని కూటమి పార్టీల నాయకులు హెచ్చరించారు. శనివారం ద్రాక్షారామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ద్రాక్షారామం మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నేత కాటే సుబ్రమణ్యం మాట్లాడుతూ, నియోజకవర్గంలో జరుగుతున్న అసాధారణ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే పిల్లి సూర్యప్రకాశ్ ఇలాంటి బాధ్యతారాహిత్యమైన విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై కాకుండా ప్రజాదరణ కలిగిన నాయకులను ఏకవచనంతో సంబోధిస్తూ వ్యక్తిగత దూషణలు చేయడం ప్రజాస్వామ్యానికి తగదన్నారు. గత మూడు దశాబ్దాలుగా ఏ నాయకుడూ చేయని విధంగా మంత్రి సుభాష్ తక్కువ కాలంలోనే దాదాపు రూ.250 కోట్ల నిధులతో నియోజకవర్గ రూపురేఖలు మార్చారని ద్రాక్షారామంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ మంజూరు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమని కొనియాడారు. అలాగే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న శిరోముండనం బాధితుల కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను మంత్రి చొరవతోనే పరిష్కరించారని నిరుద్యోగుల కోసం 45 జాబ్ మేళాలు, మహిళలకు వృత్తి శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి కల్పించారని గుర్తుచేశారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ ద్వారా వేలాది మందికి సామాజిక సేవ చేస్తూ పేదల గుండెల్లో నిలిచిన నాయకులను విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మంత్రి సుభాష్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైసిపి నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారనే భయంతోనే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు కనికెళ్ల సత్తిబాబు, గుంటూరు వరప్రసాద్, పెయ్యల బాబేలు, కాశి స్వామి, కనికెళ్ల సూర్యనారాయణలతో పాటు పలువురు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని మంత్రి సుభాష్‌కు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.







# తుని చిన్నారి మిస్సింగ్ కేసులో
# తీరని విషాదం

● 'జాను' ఆచూకీ చూపకుండానే పెంపుడు కుక్క మృతి! ● ఏడో రోజున ప్రాణాలు విడిచిన విశ్వాసపాత్రుడు..
● కన్నీరుమున్నీరవుతున్న దొండవాక గ్రామం ● చివరి ఆధారమూ చేజారడంతో పోలీసుల దర్యాప్తుకు బ్రేక్? ● కిడ్నాప్ కోణంపైనే ఇక పూర్తి నిఘా!

**తుని రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన మూడేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి (జాను) ఉదంతం శనివారం అత్యంత ఉత్కంఠభరితమైన, విషాదకరమైన మలుపు తిరిగింది. పాప అదృశ్యమైన రోజు నుంచి ఈ కేసులో ఏకైక క్లూగా భావిస్తూ, అందరిలోనూ ఆశలు రేకెత్తించిన వారి పెంపుడు కుక్క 'భైరవుడు' శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. చిన్నారి ఆచూకీ కనుగొనడంలో కీలక ఆధారంగా నిలుస్తుందనుకున్న మూగజీవి ఇలా అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో దర్యాప్తు ఒక్కసారిగా క్లిష్టతరంగా మారింది.

**ఆహారం ముట్టకుండా.. పాప కోసమే ప్రాణాలొదిలి!**

జూన్ 6న పాపతో పాటు అదృశ్యమైన ఈ పెంపుడు కుక్క, మూడు రోజుల తర్వాత ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చింది. అయితే నాటి నుంచి అది తీవ్రమైన ఆందోళనతో వింతగా ప్రవర్తిస్తూ, కనీసం ఆహారం, నీరు కూడా ముట్టలేదు. బుధవారం హైదరాబాద్ ప్రత్యేక బృందం సాయంతో పోలీసులు దీని మెడకు హై-టెక్ ఉూా ట్రాకర్ కాలర్‌నులి అమర్చి అడవిలోకి వదిలారు. శనివారం కూడా కుక్క కదలికల ఆధారంగా తోటల్లో గాలిస్తుండగా, అది అకస్మాత్తుగా కుప్పకూలి ప్రాణాలు విడిచింది. చిన్నారి ఎక్కడో ప్రమాదంలో చిక్కుకుందనే బాధతోనో, లేక దట్టమైన అడవిలో తిరగడం వల్ల వచ్చిన నీరసంతోనో అది చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. అయితే, కేసును పక్కదారి పట్టించడానికి ఎవరైనా దీనిపై లివిషప్రయోగంలి చేశారా? అనే కోణంలోనూ పోలీసులు ఫోరెన్సిక్ పరీక్షలకు ఆదేశించారు.

**ఆపరేషన్ జాను: 1000 ఎకరాల్లో కొనసాగుతున్న గాలింపు**

మరోవైపు చిన్నారి జాను కోసం కాకినాడ ఎస్పీ జీ. బిందు మాధవ్ పర్యవేక్షణలో, పెద్దపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ నేతృత్వంలోని 10 ప్రత్యేక బృందాలు గాలింపును మరింత ఉధృతం చేశాయి. 250 మందికి పైగా పోలీస్, ఎస్డిఆరెఫ్ అటవీ శాఖ సిబ్బంది దట్టమైన పామాయిల్ తోటలను, కొండ కోనలను జల్లెడ పడుతున్నారు. మనుషులు వెళ్లలేని దారిలో లిరెండు డ్రోన్ కెమెరాలలి ద్వారా నిరంతర నిఘా ఉంచారు.

**ఇక కిడ్నాప్ కోణమే కీలకం!**

చిన్నారి ఆచూకీని చూపించాల్సిన కుక్క చనిపోవడంతో, పోలీసులు ఇప్పుడు పూర్తిస్థాయిలో కిడ్నాప్ కోణంపై దృష్టి సారించారు. చుట్టుపక్కల గ్రామాల అనుమానితులను, రైల్వే స్టేషన్, హైవేల సీసీటీవీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి ప్రకటించిన లిరూ. 1 లక్ష నగదు బహుమతిలి ఇంకా కొనసాగుతోంది.

**విశ్వాసానికి మరణశాసనం!**

మనుషులే స్వార్థంతో బంధాలను మరుస్తున్న ఈ రోజుల్లో, ఆ మూగజీవి చూపిన విశ్వాసం దొండవాక గ్రామస్తుల కళ్లల్లో నీళ్లు తెప్పిస్తోంది. పాప కనిపించకుండా పోయిన రోజు నుంచి 'భైరవుడు' పడిన ఆరాటం అంతా ఇంతా కాదు. చిన్నారి జాను ఫోటోను చూపిస్తే చలించిపోయే ఆ కుక్క, చివరికి పాప కోసం వెతుకుతూనే కన్నుమూయడం స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది.

**జీపీఎస్ డేటాపై పోలీసుల ఆశలు**

కుక్క చనిపోయినప్పటికీ, గత రెండు రోజులుగా దాని మెడకున్న జీపీఎస్ ట్రాకర్ ద్వారా రికార్డైన శాటిలైట్ రూట్ మ్యాప్‌ను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అది అడవిలో ఏయే ప్రాంతాలకు వెళ్లింది? ఎక్కడెక్కడ ఎక్కువసేపు ఆగింది? అనే డేటాను విశ్లేషించడం ద్వారా చిన్నారి ఉన్న చోటుపై ఏమైనా క్లూ దొరుకుతుందేమోనని సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నాయి.

కోరంగిలో

## ఉచిత నేత్ర వైద్య శిబిరం



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరంగి గ్రామంలో జిల్లా ఆటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కోరింగ బయోడైవర్సిటీ సెంటర్లో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ సహకారంతో ఆల్ ఐ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ, శ్రీ సూర్య ఐ కేర్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు సహాయార్థం 20 ఈడీసీల గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఫారెస్ట్ రేంజర్ ఎస్-ఎస్ఆర్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ఏటీ రామ్ ప్రకాష్ మాట్లాడుతూ సముద్రంలో పనిచేసేవాళ్లకు తీవ్రమైన సూర్యరశ్మి(యూవీ కిరణాలు), ఉప్పునీటి తుంపర్లు, బలమైన గాలులు, ఇసుక దుమ్ము వలన కంటి చూపు త్వరగా దెబ్బతింటుందన్నారు. ఇటువంటి శిబిరాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చికిత్స చేయించుకుని అవసరమైన మత్స్యకారులకు మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేసామని, సుమారు 50 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు, బీట్ ఆఫీసర్ జి.గోపీ, కె. ధనుంజయ్ ఈడీసీ చైర్మన్ పి.ఆనందరావు, వైస్ చైర్మన్ బండారు సీతారామలక్ష్మి, తాతాజీ, ఏఎల్ ఐ ఫౌండేషన్ సిబ్బంది వి. విజయ్ కుమార్, కెవి రమణ, కే.శైలు, వి.ప్రసన్న కుమార్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులు, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామికి

## మరో అరుదైన గౌరవం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామికి మరో అరుదైన గౌరవం లభించింది. రాజమండ్రిలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ప్రతిష్టాత్మక ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం చేశారు. సమాజ సేవ, ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, సామాజిక అభివృద్ధి రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వ్యక్తులను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తుండగా, ఈ ఏడాది ఆలమూరు మండలంకు చెందిన మెర్ల గోపాలస్వామి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ప్రస్తుతం డీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గోపాలస్వామి రైతుల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తున్నారు. సాగునీటి సమస్యలు, కాలువల నిర్వహణ, నీటి పంపిణీ, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో రైతులకు అండగా నిలుస్తూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపుతున్నారు. సేవాభావంతో నిరంతరం ముందుకు సాగుతున్న ఆయనకు ఉత్తమ సేవా పురస్కారం లభించడం పట్ల మెర్ల గోపాలస్వామిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ ఇదే సేవాస్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువై మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మెర్ల గోపాలస్వామి పేర్కొన్నారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామిని పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నేతలు, అభిమానులు అభినందించారు.

# పవన్ నయా స్కెచ్.. విజయ్ దారిలోనే జనసేనాని..!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు సరికొత్త సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. నిన్నటివరకు ఒక లెక్క.. ఇప్పటి నుంచి ఒక లెక్క అనే రేంజ్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా, సరికొత్త ఓట్ బ్యాంక్‌ను సొంతం చేసుకునేందుకు ఆయన వేస్తున్న అడుగులు ఇప్పుడు ఏపీ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా పొరుగు రాష్ట్రం తమిళనాడులో దళపతి విజయ్ సృష్టించిన పొలిటికల్ సెన్సేషన్‌ను పవన్ కల్యాణ్ నిశితంగా గమనిస్తున్నారనే చర్చ సర్క్యులేట్ అవుతోంది. తమిళనాడులో విజయ్ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికార పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రధాన కారణం.. యువత, మహిళా ఓటర్లు. ఇప్పుడు పవన్ కల్యాణ్ సైతం సరిగ్గా ఇదే ఫార్ములాను ఏపీలో అప్లై చేయాలని చూస్తున్నారు. రాబోయే 2029 ఎన్నికల నాటికి రాష్ట్రంలో లక్షల సంఖ్యలో కొత్త ఓటర్లు (ఫస్ట్ టైమ్ ఓటర్లు) యాడ్ కాబోతున్నారు. పాత రాజకీయాలు, కులాల సమీకరణలతో సంబంధం లేని ఈ కొత్త తరం ఓటర్లే రేపటి విజేతను డిసైడ్ చేయబోతున్నారు. అందుకే పవన్ కల్యాణ్ కన్ను పూర్తిగా ఈ యూత్ ఫోర్స్ పైనే పడింది. తెలుగు రాష్ట్రాల్లో



రాజకీయాలు అనగానే కులాల ప్రస్తావన వస్తుంది. కానీ పవన్ కల్యాణ్ ఈ పాత పంథాను బ్రేక్ చేయాలనుకుంటున్నారు. "నన్ను ఒక కులానికే పరిమితం చేయకండి.. అందరూ ఓట్లేస్తేనే నేను గెలిచాను" అని ఆయన పదే పదే చెప్పడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. తనపై ఉన్న సొంత సామాజికవర్గ ముద్రను చెరిపేసి, అందరి నాయకుడిగా ఎదగాలన్నది పవన్ ప్లాన్. అందుకోసం అవసరమైతే సొంత వర్గాన్ని కాస్త దూరం పెట్టడానికైనా ఆయన వెనకాడటం లేదని జనసేన వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఏపీ పాలిటిక్స్‌లో చంద్రబాబు మినహా మిగిలిన ప్రధాన నేతలంతా దాదాపు యువకులే. వైసీపీలో జగన్, టీడీపీలో లోకేశ్, జనసేనలో పవన్.. ఈ ముగ్గురిలో యువత ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేదే ఇక్కడ పాయింట్. పవన్ కల్యాణ్‌పై ఎలాంటి అవినీతి మరకలు లేకపోవడం ఆయనకు ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపైనే తన ఫోకస్ అని నిరూపించుకునే తాపత్రయంలో ఆయన ఉన్నారు. ఈ క్లీన్ ఇమేజ్‌తోనే లోకేశ్, జగన్‌ల కంటే వేగంగా యువతకు కనెక్ట్ అవ్వాలని జనసేనాని భావిస్తున్నారు. మొత్తానికి తమిళనాడులో విజయ్ మ్యాజిక్ రిపీట్ చేసినట్లే.. ఏపీలో సరికొత్త యూత్ వేవ్‌ను సృష్టించి పవర్ పాలిటిక్స్‌లో కింగ్ కావాలన్నదే పవన్ కల్యాణ్ నయా స్కెచ్. మరి 2029 నాటికి ఈ కొత్త ఓటర్ల అస్త్రం జనసేనానికి ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# అన్నదమ్ముల సవాల్.. టీడీపీకి ఎఫెక్ట్ అవుతుందా?



వ్యక్తిగత వివాదాలు.. కుటుంబ అంశాలను రాజకీయాల్లోకి తీసుకువస్తే.. అంతిమంగా నాయకులే నష్టపోతారన్న విషయం తెలిసిందే. కుటుంబ అంశాలను.. రాజకీయాలతో మిళితం చేసి విజయం దక్కించు కున్న వారు చాలా కొద్దిమందే ఉన్నారు. అయినప్పటికీ.. చాలా మంది నాయకులు ఇప్పటికీ.. వ్యక్తిగత వ్యవహారాలను రాజకీయాలకు ముడిపెట్టి రచ్చ చేస్తున్నారు. విజయవాడ ఎంపీ.. మాజీ ఎంపీ కేశినేని బ్రదర్స్‌గా పిలుచుకునే నాని-చిన్నిల మధ్య కొన్నేళ్లుగా వివాదాలు ఉన్నాయి. అవి కుటుంబ వివాదాలే తప్ప.. రాజకీయపరమైన వివాదాలు కావు. అయినప్పటికీ.. వారివు రు కూడా.. ఈ విషయాలను సామాజిక మాధ్యమాల్లో రాజకీయ వివాదాలుగా మార్చుకుని రచ్చ చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. దీనివల్ల వ్యక్తిగతంగా వారికి ఎలా ఉన్నా.. ఎంపీ చిన్నీ ప్రాతినిధ్యం వహించిన టీడీపీ విషయంలో విమర్శలు వచ్చేలా చేస్తున్నాయి. నిజానికి విజయవాడలో టీడీపీకి బలమైన మద్దతు ఉంది. నగర పరిధిలో మూడు అసెంబ్లీ స్థానాలు ఉంటే .. రెండు చోట్ల టీడీపీనే విజయం దక్కించుకుంది. ఇక, విజయవాడ ఎంపీగా.. వరుస విజయాలు దక్కించు కున్న నాని, చిన్ని మారినా.. పార్టీ పరంగా టీడీపీనే 2014 నుంచి ఇప్పటి వరకు గెలుపు గుర్రం ఎక్కింది. అంతే కాదు.. 2019లో వైసీపీ హవా వీచినా.. విజయవాడ ప్రజలు టీడీపీకే పట్టం కట్టారు. అంటే.. ఇది వ్యక్తి బలం కన్నా.. పార్టీ బలానికి సంకేతంగా మారింది. ఇప్పుడు ఇద్దరు అన్నదమ్ములు.. వివాదాలకు దిగడం.. ఎంపీ చిన్ని.. తన అన్న నానీపై కేసు పెట్టడం వంటివి వారికి ఎలా ఉన్నా.. పార్టీ పరంగా నాయకులు చిన్నబోతున్నారన్నది ప్రధానంగా వినిపిస్తున్న మాట. ఏదైనా వివాదం ఉంటే తేల్చు కునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. కానీ.. పార్టీ ప్రతిష్ఠకు నష్టం చేకూర్చేలా ఎవరూ వ్యవహరించరాదని పార్టీ అధినేత చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ చిన్ని.. ఈ వివాదాన్ని సామరస్య పూర్వకంగా వ్యక్తిగతంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలన్న సూచనలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి.

ఐఎఫ్‌టీయూ సర్వసభ్య సమావేశాన్ని

## విజయవంతం చేయాలి : నందూరి సతీష్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో కార్మి కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, పెరుగుతున్న నిరుద్యోగం, కాంట్రాక్ట్ విధానం, కనీస వేతనాల అమలులో జరుగుతున్న నిర్లక్ష్యం వంటి సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐ ఎఫ్ టి యు) రాజమహేంద్రవరం నూతన సర్వసభ్య సమావేశం 2026 జూన్ 14వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరంలోని మావో భవన్‌లో నిర్వహించబడుతుందని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నందూరి సతీష్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మిక చట్టాల అమలు, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం, పెరుగుతున్న ధరల భారం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల ఐక్యతే వారి శక్తి అని, హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటమే మార్గమని పేర్కొన్నారు. అందువల్ల రాజమహేంద్రవరం నగరం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని నందూరి సతీష్ పిలుపునిచ్చారు.

త్రిబుల్ ఐటీకి ఆలమూరు మండలం నుండి

## ఎనిమిది మంది విద్యార్థినిలు ఎంపిక

**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో ఎనిమిది మంది విద్యార్థినిలు ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. మండల కేంద్రమైన ఆలమూరు డాక్టర్ బొబ్బా జయశ్రీ జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు వంగివరపు గాయత్రి, పాండ్రాకుల పూర్ణ లక్ష్మీదేవి, మూలస్థానం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎన్ శ్రీనిధి, జి ఐశ్వర్య,ఎల్ చాందిని, చెముడులంక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి డి ప్రసన్నకుమారి, తేజ అశ్విని, మేడిశెట్టి హరిణి త్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థినులను ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎన్.రాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.



## అధిక లోడు అధి జోరుతో

# పోలీసుల ఆదేశాలు సైతం బేఖాతార్

### బెంబేలెత్తుతున్న వాహనదారులు - తీరు మార్చుకొని మట్టి మాఫియా











**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో అక్రమ మట్టి, ఇసుక, కంకర మాఫియా పోలీస్ అధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ అధిక లోడు అధిక జోరుతో ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇటీవల జంబుపట్నం గ్రామంలో మట్టి మాఫియాకు సంబంధించిన లారీ ఒక వ్యక్తి ప్రాణాలను బలికున్న విషయం పాఠకులకు విధితమే. ఆ సందర్భంగా రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో అధిక లోడు, అధిక స్పీడుతో వెళుతున్న లారీలను సీజ్ చేయాలని, పెద్ద మొత్తంలో పెనాల్టీలు వేసి, వారి ఆగడాలను అరికట్టాలని ఆదేశించారు. వెనువెంటనే కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వివి సత్యనారాయణ మూర్తి లారీ డ్రైవర్లతోనూ, లారీ యాజమాన్యంతోను సమావేశం ఏర్పాటు చేసి ఓవర్ లోడు ఓవర్ స్పీడ్ తగ్గించాలని ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంగా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు. అయితే అక్రమ మట్టిమాఫీ మాత్రం పోలీస్ అధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ, ఓవర్ లోడ్ ఓవర్ స్పీడ్ తో ప్రజలకు, వాహనదారులకు అనునిత్యం చుక్కలు చూపిస్తున్నారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అనునిత్యం ఇంత తతంగం జరుగుతున్న పోలీసు ఉన్నతాధికారులు, రోడ్ ట్రాన్స్పోర్ట్ అధికారులు మొద్దు నిద్ర వహిస్తూ, ఏ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. సంబంధిత అధికారుల చర్యలు పేపర్లకే పరిమితం, అవుతున్నాయన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇక మండలంలో ఇరిగేషన్ అనుమతులు లేకుండా రాజకీయ పలుకుబడితో సమయాభావం లేకుండా మట్టి మాఫియా యదేచ్చగా అక్రమం మట్టి రవాణా చేస్తుంది. రెవెన్యూ అధికారులు కూడా ఈ విషయంపై దృష్టి సారించి, అనుమతులు లేని లారీలను సీజ్ చేయాలని రాజకీయ నాయకులు, ప్రజలు కోరుతున్నారు. ఏది ఏమైనా సంబంధిత అధికారులు ఓవర్ లోడ్ ఓవర్ స్పీడ్ కు, బ్రేకులు వెయ్యకపోతే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు ఈ అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందని ప్రజా ప్రతినిధులు, వాహనదారులు అంటున్నారు.

## ప్రపంచ 8వ తెలుగు మహాసభలను

# అమెరికాలో నిర్వహిస్తాం

### డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము

### - శ్రీశ్రీ కళావేదిక అమెరికా ప్రతినిధిగా డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము నియామకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాహిత్య, సాంస్కృతిక, సేవాకార్యక్రమాలు నిర్వహించే శ్రీ శ్రీ కాళావేక అమెరికా ప్రతినిధి గా ప్రముఖ సినీ నిర్మాత, సోనస్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము నియామించినట్లు శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తి మండ ప్రతాప్ తెలిపారు. శనివారం రాజమండ్రి షెల్టన్ హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో శ్రీశ్రీ కళావేదిక కు 11, వేల మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. సాంస్కృతిక, సాహిత్య , సేవ రంగాలలో శ్రీశ్రీ కళా వేదిక విశేషమైన కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐ ఎస్ ఓ గుర్తింపు పొందిన తమ శ్రీశ్రీ కళా వేదిక అనేక సంఘాలలో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తమ ఆధ్వర్యంలో 7వ ప్రపంచ తెలుగు మహాసభ రాజమహేంద్రవరంలో నిర్వహించామని అన్నారు. వివిధ రంగాలలో సేవలు అందించిన కళాకారులను గుర్తించి వారికి సన్మానాలు చేస్తానని అన్నారు. ప్రముఖ సినీ నిర్మాత, సంఘ సేవకులు డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము వివిధ రంగాలలో ఆయన చేసిన సేవలు గుర్తించి శ్రీశ్రీ కళావేదిక అమెరికా ప్రతినిధిగా నియమించినట్లు తెలిపారు. డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము ను ఘనంగా సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక అమెరికా ప్రతినిధిగా నియామకం పొందిన ప్రముఖ ప్రవాస ఆంధ్రులు డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము మాట్లాడుతూ 8వ తెలుగు మహాసభలను అమెరికాలో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తనను శ్రీ శ్రీ కళావేదిక అమెరికా ప్రత్యేక ప్రతినిధిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒక ఎన్జీవో సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందడం అరుదైన విషయమని అన్నారు. తాను అమెరికాలో తానా తెలుగు మహాసభ లిటరేచర్ కల్చరల్ ఆర్గనైజేషన్ చైర్మన్ గా 40 సంవత్సరాలు పని చేసినట్టు తెలిపారు. తెలుగు అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. ఈ సందర్భంగా సాహిత్య కళా రంగాలలో విశేష కృషిచేసిన కళాకారులు మెర్ల వేణుగోపాల్, కత్తిమండ ప్రతాప్, కేత శ్రీనివాస్, దండు బోయిన వీర వెంకట సత్యనారాయణ మూర్తి , గారా శ్రీనివాస్, చెల్లుబోయిన శ్రీనివాస్ రావు తదితరులను సత్కరించారు.

## సోనస్ కార్పొరేట్ క్రికెట్ లీగ్-2026

# టోర్నమెంట్ కప్ ఆవిష్కరణ






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యువతను క్రీడల్లో ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న సోనస్ కార్పొరేట్ క్రికెట్ లీగ్-2026 టోర్నమెంట్ కప్‌ను ప్రముఖ ప్రవాస భారతీయుడు, డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం నగరంలోని షెల్టన్ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సోనస్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో సోనస్ కార్పొరేట్ క్రికెట్ లీగ్-2026ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొంటాయని, ప్రభుత్వ ఉద్యోగులు తమ విరామ సమయాల్లో శని, ఆదివారాల్లో పోటీల్లో పాల్గొనేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. విజేతలకు భారీ నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్న ఆయన, ఉద్యోగుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. జేమ్స్ వాట్స్ కొమ్ము మాట్లాడుతూ, రెండో ఏడాది ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో రంజీ స్థాయి పోటీల ద్వారానే జాతీయ స్థాయికి చేరుకునే అవకాశాలు ఉండేవని, ప్రస్తుతం కార్పొరేట్ సంస్థల ప్రోత్సాహంతో క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు భద్రం మాట్లాడుతూ, డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము సాఫ్ట్‌వేర్ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, సమాజ సేవలోనూ ముందుంటున్నారని కొనియాడారు. సమన్వయి ఫౌండేషన్ ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని, యువత క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ క్రికెట్ లెజెండ్-2026 టోర్నమెంట్‌లో పాల్గొనే 12 జట్ల కెప్టెన్లు, సోనస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలో తొలిసారిగా ఈ లీగ్ మ్యాచ్‌లను లైవ్ స్క్రీన్లపై ప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

**సోనస్ ఏఐ ఎనీ సెంట్స్ హబ్ సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణ**

ఈ సందర్భంగా డాక్టర్ చిమ్మలరి శ్రీనివాస్ రూపొందించిన సోనస్ ఏఐ ఎనీ సెంట్స్ హబ్ సాఫ్ట్‌వేర్‌ను డాక్టర్ జేమ్స్ వాట్స్ కొమ్ము ఆవిష్కరించారు. అనంతరం ఆ యాప్‌ను ఆయనకు బహూకరించారు.

# ప్రగతి పాదయాత్రలో జాతీయ రహదారి అభివృద్ధి పనుల పరిశీలన

### దేశ వ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత : ఎంపీ పురంధేశ్వరి




**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మండలం దివాన్‌చెరువులో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ రహదారి అభివృద్ధి పనులను బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రగతి పాదయాత్ర'లో పరిశీలించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు తగరం సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రగతి పాదయాత్ర కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కిన నాగేంద్ర జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మెరుగైన రహదారి సదుపాయాలు రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజల ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో మౌలిక సదుపాయాల రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, జాతీయ రహదారుల విస్తరణ ద్వారా ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని నాయకులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే 'ప్రగతి పాదయాత్ర' ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజానగరం మండల అధ్యక్షుడు అళ్ల శివ, ఎస్సీ మోర్చా నాయకులు సేతు మాధవ్, యజ్జల శ్రీనివాస్, బట్టు రమేష్, కాటూరి యేసు, అర్దాల కుమార్, దుర్గాప్రసాద్, కృష్ణ, జిల్లా కార్యదర్శి మోహిని, పోలవరపు రాము, కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సొంత పార్టీ నాయకుడే

# ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటున్న జనసైనికులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రఘుదేవపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు మావిడాల సుబ్రహ్మణ్యం అతని బావ అడపా రాజు అనువారు దౌర్జన్యంగా వినాయకుడి గుడి సమీపంలోని పంచాయతీ రోడ్డును సైతం ఆక్రమించుకొని కంచె నిర్మించారని బాధితులు గుర్రాల దుర్గాప్రసాద్ అతని తల్లి గుర్రాల పోసమ్మ ఆరోపించారు. ఈ సందర్భంగా గుర్రాల దుర్గాప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పోటీ చేసినప్పుడు మేము కూడా కార్యకర్తలుగా పని చేసామని నేటి ఎమ్మెల్యే బలరామకృష్ణ నిన్ను మంచి పనులు చేసి ఎమ్మెల్యే సీటు సాధించి నాయకుడూ చేయలేని అభివృద్ధి కార్యక్రమాలు బలరామకృష్ణ చేశారని జన సైనికులంతా ఆనందం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మా గ్రామంలో ఉన్న మావిడాల సుబ్బు అనే వ్యక్తి వలన మాకు రాబోయే రోజుల్లో నిలువ నీడ లేకుండా పోతుందని మా వీధిలోని ఉన్న వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజాధనంతో అప్పట్లో నిర్మించిన సిసి రోడ్లను సైతం ఐదు అడుగులమేర బద్దలు కొట్టి దారి రోడ్డును సైతం ఆక్రమించుకుని అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. నేను నా కుటుంబ సభ్యులు తూర్పు దిశగా వీధిలోకి వెళ్లాలంటే రోడ్డును పూర్తిగా నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమి అన్యాయమని అడిగితే పార్టీ మాది ఎమ్మెల్యే మా మనిషి మేమెంత చెబితే అంతని దుర్భాషలాడుతున్నారని అన్నారు. జనసేన నాయకుడు గెద్దాడ త్రిమూర్తులు సిసి రోడ్డును సైతం బద్దలు కొట్టి ఆక్రమించుకోమని చెప్పడం ఎంతవరకు సమంజసమని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మాకు తూర్పు దిశగా ఎలాంటి దారి లేకుండా చేసి సుబ్రహ్మణ్యం అతని భావరాజు మాత్రమే వెళ్లేందుకు దారిని నిర్మించుకున్నారని మమ్ములను నిర్బంధించారని మా సమస్యపై జిల్లా అధికారులు మండలాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. గత 30 సంవత్సరాల క్రితం మేము ఇంటి స్థలాన్ని కొనుక్కొని ఇల్లు నిర్మించుకుని ఇక్కడ స్వేచ్ఛగా జీవిస్తున్నామని,ఇప్పుడు ఈ మామిడాల సుబ్బు వలన మాకు నిలువ నీడ లేకుండా స్థానికులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు స్వేచ్ఛగా ఉండేందుకు తగిన సహాయ సహకారాలు అందించాలని స్థానికులు ఎమ్మెల్యేను,మండల అధికారులను కోరుతున్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష

# మినహాయింపు ఇవ్వాలి

### యూటీఎఫ్ డిమాండ్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 2010కు ముందు ఉపాధ్యాయ సేవలో చేరిన ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పి.జయకర్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈవిఎస్ఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన శనివారం రాజమహేంద్రవరంలోని ఎల్ఐసీ భవన్‌లో తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జయకర్ మాట్లాడుతూ, ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు కల్పించాలంటే పార్లమెంట్‌లో చట్ట సవరణ అవసరమని, ఆ లక్ష్య సాధన కోసం యూటీఎఫ్ దశలవారీగా ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. అలాగే భవిష్యత్తులో క్యాడర్‌ను జిల్లాల వారీగా ఎలా విభజిస్తారనే అంశంపై సభ్యులకు అవగాహన కల్పించారు. జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికే జిల్లాలో 10,652 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు. వచ్చే నెలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమర్పించిన నివేదికల ఆధారంగా విద్యాసంవత్సర పనితీరు ప్రణాళికలను సమీక్షించారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.వెంకటరత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు జె.రూపస్‌రావు, కోశాధికారి శ్రీనివాసమూర్తి, కుటుంబ సంక్షేమ పథకం ప్రధాన బాధ్యుడు పి.సురేంద్రకుమార్, జిల్లా కార్యదర్శులు కె.రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, జి.సీతాదేవి, వి.వి.నర్సారెడ్డి, కె.నాగభూషణం, ఎం.శ్రీనివాస్, కె.వి.ఎస్.ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఐ.డి.కె.డి.రాజేశ్వరి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలో సీట్లు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పాలడుగు సత్యవతి చంద్రమౌళి బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఐఐఐటీలో సీట్లు సాధించి పాఠశాల ఖ్యాతిని చాటారు. డాక్టర్ పాలడుగు సత్యవతి చంద్రమౌళి బాలికోన్నత పాఠశాలకు చెందిన కె.భావిక, ఏ.ప్రియాంకలు 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ట్రిబుల్ ఐటి కౌన్సెలింగ్ ఫలితాల్లో అత్యద్భుత ప్రతిభ కనబరిచి సీట్లు దక్కించుకున్నారు. కష్టతరమైన పరిస్థితులను అధిగమించి ఉన్నత విద్యలో మరో మెట్టు ఎక్కిన విద్యార్థినులను పలువురు అభినందించారు.మండల విద్యాశాఖాధికారులు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముంగర వెంకటరాజు, విద్యా కమిటీ చైర్మన్ సత్యప్రియ, ఉపాధ్యాయులు, సిబ్బంది తల్లిదండ్రులు విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ముంగర వెంకటరాజు మాట్లాడుతూ భావికకు నూజివీడు ఐఐఐటీతో పాటు, ప్రియాంకకు ఒంగోలులో సీట్లు రావడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఐటీ సీట్లు సాధించడమే తమ పాఠశాల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా కష్టపడితే అత్యున్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించగలరని ఈ విద్యార్థినులు నిరూపించారని పలువురు కొనియాడారు.



### ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

# స్కిన్ కేర్ సీక్రెట్ ఇదే..

## గ్లోయింగ్ చర్మం కోసం బన్నీ ఏం చేస్తారో తెలుసా?



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గ్లామర్ మరియు ఫిట్‌నెస్ వెనుక ఉన్న అసలు రహస్యాలు ఏంటి? పుష్ప రాజ్ లాంటి మాస్ లుక్‌లోనూ, రియల్ లైఫ్‌లోనూ ఆయన చర్మం అంతగా మెరిసిపోవడానికి కారణమేంటి? బన్నీ స్వయంగా వెల్లడించిన కొన్ని ఆసక్తికరమైన స్కిన్ కేర్ మరియు లైఫ్ స్టైల్ చిట్కాలు మీకోసం. వెండితెరపై స్టైలిష్ స్టార్‌గా ఎంట్రీ ఇచ్చి, ఇప్పుడు ఐకాన్ స్టార్‌గా గ్లోబల్ రేంజ్‌లో దూసుకుపోతున్నారు అల్లు అర్జున్. సినిమాల్లో ఆయన చూపించే ఎనర్జీ, డాన్స్ మూమెంట్స్ మాత్రమే కాదు, ఆయన స్టైల్ మరియు గ్లామర్ కూడా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. నిరంతరం షూటింగులు, లైట్లు, మేకప్ మరియు విపరీతమైన ప్రయాణాల మధ్య కూడా అల్లు అర్జున్ తన చర్మాన్ని మరియు ఫిట్‌నెస్‌ను ఎలా కాపాడుకుంటున్నారు? ఆయన గ్లోయింగ్ స్కిన్ వెనుక ఉన్న అసలు సీక్రెట్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. సెలబ్రిటీలు అనగానే కేవలం ఖరీదైన ట్రీట్‌మెంట్లు, బ్యూటీ ప్రొడక్ట్స్ మాత్రమే వాడతారని చాలా మంది అనుకుంటారు. కానీ, అల్లు అర్జున్ తన స్కిన్ కేర్ విషయంలో బేసిక్స్ మరియు సహజమైన పద్ధతులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. చర్మం ఆరోగ్యంగా ఉండటానికి బాడీని హైడ్రేటెడ్‌గా ఉంచడం అత్యంత అవసరమని ఆయన నమ్ముతారు. అందుకే రోజుకు కనీసం 3 నుండి 4 లీటర్ల నీటిని ఖచ్చితంగా తాగుతారు. నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ అన్నీ బయటకు వెళ్ళిపోయి, చర్మం లోపలి నుండి సహజమైన కాంతిని పొందుతుంది. దీనితో పాటు, అల్లు అర్జున్ తన డైట్ విషయంలో ఎంతో క్రమశిక్షణగా ఉంటారు. చర్మ సంరక్షణ అనేది మనం పైన రాసే క్రీముల కంటే లోపలికి తీసుకునే ఆహారం పైనే ఆధారపడి ఉంటుందని ఆయన వివరిస్తుంటారు. ఆయన నిత్యం తాజా పండ్లు, ఆకుకూరలు మరియు యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే జ్యూస్‌లను తన ఆహారంలో భాగంగా చేసుకుంటారు. ముఖ్యంగా విటమిన్-సి ఎక్కువగా ఉండే పండ్లు చర్మాన్ని ముడతలు పడకుండా, ఎల్లప్పుడూ యంగ్‌గా ఉంచడానికి సహాయపడతాయి. జంక్ ఫుడ్, జిడ్డు పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే చర్మం అంత సురక్షితంగా ఉంటుందని బన్నీ నమ్ముతారు. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ప్రతిరోజూ వర్కవుట్ చేయడం అల్లు అర్జున్ అలవాటు. వ్యాయామం చేయడం వల్ల శరీరంలో రక్తప్రసరణ బాగా జరిగి, చర్మ కణాలకు తగినంత ఆక్సిజన్ అందుతుంది. ఇది ముఖంపై సహజమైన గ్లో రావడానికి కారణమవుతుంది. షూటింగ్ అయిపోగానే మేకప్‌ను పూర్తిగా తొలగించి, రాత్రి పడుకునే ముందు చర్మాన్ని క్లెన్సింగ్ మరియు మాయిశ్చరైజ్ చేయడం ఆయన అస్సలు మర్చిపోరు. ఐకాన్ స్టార్ పాటించే ఈ సింపుల్, నైచురల్ లైఫ్ స్టైల్ రూటిన్‌ను మనం కూడా పాటిస్తే మెరిసే చర్మాన్ని సొంతం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.



### మొదటి భర్తకు విడాకులు..

# తన కన్నా 12 ఏళ్ల చిన్నవాడితో ఎఫైర్..

ఒకప్పుడు ఇండస్ట్రీలో స్పెషల్ సాంగ్స్ అంటే గుర్తొచ్చే మొదటి పేరు ఆమెదే. అందం, అభినయంతో వెండితెరపై మ్యాజిక్ క్రియేట్ చేసింది. హీరోయిన్ కాదు.. అయినా స్పెషల్ పాటలతో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇండస్ట్రీలో హీరోయిన్లకు మించిన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇటీవల సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ తెగ సందడి చేస్తున్నాయి. సినిమా రిజల్ట్ ఎలా ఉన్న అందులోని స్పెషల్ సాంగ్స్ మాత్రం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సినిమాలకు మించి క్రేజ్ తెచ్చుకుంటున్నాయి స్పెషల్ సాంగ్స్. అప్పట్లో స్పెషల్ సాంగ్స్ కోసం కొంతమంది ముద్దుగుమ్మలు తీసుకునేవారు. కానీ ఇప్పుడు హీరోయిన్స్ కూడా స్పెషల్ సాంగ్స్ చేస్తున్నారు. తమన్నా, సమంత, శ్రీలీల, శ్రుతిహాసన్ లాంటి హీరోయిన్ స్పెషల్ సాంగ్స్ చేస్తూ మెప్పిస్తున్నారు. తమన్నా హిందీ సినిమాల్లో స్పెషల్ సాంగ్ చేసిన దుమ్మురేపుతోంది. అలాగే ఇటీవలే విడుదలైన పెద్ది సినిమాలో శ్రుతి స్పెషల్ సాంగ్ లో అదరగొట్టింది. అయితే ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ముద్దుగుమ్మ స్పెషల్ సాంగ్స్ కు పెట్టింది పేరు. ఆమె సాంగ్ చేసిందంటే అది వైరల్ అవ్వాల్సిందే.. దాంతో రెమ్యునరేషన్ కూడా గట్టిగానే డిమాండ్ చేస్తుంది ఆమె.. స్పెషల్ సాంగ్స్‌తో అలరిస్తూనే కోట్ల రూపాయిల రెమ్యునరేషన్ అందుకుంటుంది ఆ హాట్ బ్యూటీ. స్పెషల్ సాంగ్ అనగానే ముందు గుర్తుకు వచ్చేది ఈ అమ్మడే. ఆ బ్యూటీ మరెవరో కాదు బాలీవుడ్ హాట్ బ్యూటీ మలైకా అరోరా. ఈ అందాల భామ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. స్పెషల్ సాంగ్స్ కు మలైకా అరోరా పెట్టింది పేరు. తెలుగులోనూ ఈ ముద్దుగుమ్మ స్పెషల్ సాంగ్స్ తో మెప్పించింది. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన అతిథి సినిమాలో సాంగ్ చేసింది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన గబ్బర్ సింగ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసి మెప్పించింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఏజ్ 50కి పై మాటే... ఇప్పటికీ తరగని అందంతో, కుర్ర హీరోయిన్స్ కుళ్ళుకునేలా ఉంది మలైకా. అంతే కాదు పెళ్లి చేసుకోకుండగా సింగిల్ గా లైఫ్ లీడ్ చేస్తుంది. మొదట్లో సల్మాన్ ఖాన్ తమ్ముడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఓ కొడుకు ఉన్నాడు. ఆతర్వాత అతనితో విడాకులు తీసుకుంది. ఆమధ్య యంగ్ హీరో అర్జున్ కపూర్ తో ప్రేమాయణం నడిపించి ఆతర్వాత బ్రేకప్ చెప్పేసింది. ఇప్పుడు సింగిల్ గా ఉంటుంది. ఇటీవలే కొత్త బాయ్ ఫ్రెండ్ తో కనిపించిందని బీటౌన్ లో టాక్ వినిపించింది. ఇక మలైకా స్పెషల్ సాంగ్స్ తగ్గించింది. అప్పట్లో దబాంగ్' సినిమాలో 'మున్నీ బద్నామ్ హుయీ' సాంగ్ కోసం ఏకంగా రూ.2.5 కోట్లు అందుకుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ అభిమానులను కవ్విస్తుంది.

# ధర్మశాలలో అఫ్గాన్ ఆలౌట్.. భారత్ ముందు 195 పరుగుల టార్గెట్

ధర్మశాల వన్డేలో గుర్బాజ్ మెరుపు సెంచరీ చేసినా అఫ్గానిస్తాన్ 194 పరుగులకే ఆలౌట్ అయింది. డెబ్యూ బౌలర్లు హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ అద్భుతంగా రాణించడంతో భారత్‌కు 25 ఓవర్లలో 195 పరుగుల లక్ష్యం లభించింది. భారత్, అఫ్గానిస్తాన్ జట్ల మధ్య ధర్మశాల వేదికగా జరుగుతున్న ఆసక్తికరమైన మొదటి వన్డే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకున్న భారత జట్టుకు అఫ్గాన్ ఓపెనర్ గుర్బాజ్ గట్టి పోటీ ఇచ్చాడు. అయినప్పటికీ భారత బౌలర్లు చివర్లో అద్భుతంగా పుంజుకుని అఫ్గానిస్తాన్‌ను 24.5 ఓవర్లలో 194 పరుగులకే ఆల్‌అవుట్ చేశారు. దీంతో ఈ వన్డే సిరీస్‌లో బోణీ కొట్టడానికి భారత జట్టు 25 ఓవర్లలో 195 పరుగులు చేయాల్సి ఉంది. ప్రస్తుత రన్ రేట్ ప్రకారం భారత్ విజయానికి ఓవర్‌కు సగటున 7.8 పరుగులు రాబట్టాలి. టాస్ ఆలస్యం కావడంతో 25 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది. అయితే భారత ఫాస్ట్ బౌలర్లు ఆరంభంలోనే అఫ్గాన్ ఇన్నింగ్స్‌ను కోలుకోలేని దెబ్బ తీశారు. కేవలం 5 ఓవర్ల పవర్‌ప్లే ముగిసేసరికి అఫ్గానిస్తాన్ 27 పరుగులకే 3 ముఖ్యమైన వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. డెబ్యూ పేసర్ గుర్నూర్ బ్రార్ తన రెండో ఓవర్లోనే ఇబ్రహీం జద్రాన్ (1)ను అవుట్ చేసి భారత్‌కు తొలి




బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ సింగ్ వరుస ఓవర్లలో సెదికుల్లా అటల్ (0), రహ్మత్ షా (4)లను పెవిలియన్ చేర్చి అఫ్గాన్ నడుం విరిచాడు. మూడు వికెట్లు పడిపోయిన తరుణంలో అఫ్గాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కెప్టెన్ హష్మతుల్లా షాహిదీతో కలిసి అతను నాలుగో వికెట్‌కు ఏకంగా 116 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలో గుర్బాజ్ కేవలం 48 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, అఫ్గానిస్తాన్ క్రికెట్ చరిత్రలోనే వన్డేల్లో అత్యంత వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. మొత్తం 51 బంతులు ఆడిన గుర్బాజ్ 8 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 102 పరుగులు చేసి భారత జట్టుకు పెద్ద తలనొప్పిగా మారాడు. డేంజర్ జోన్‌లోకి వెళ్తున్న అఫ్గాన్ స్కోరును కట్టడి చేయడానికి కెప్టెన్ గిల్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని రంగంలోకి దించాడు. నితీష్ రెడ్డి తన అద్భుతమైన యార్కర్ బంతితో సెంచరీ వీరుడు గుర్బాజ్‌ను క్లీన్ బౌల్ చేసి మ్యాచ్‌ను మళ్లీ భారత్ వైపు తిప్పాడు. ఆ వెంటనే మరో డెబ్యూ స్పిన్నర్ హర్ష్ దూబే తన స్పిన్ మాయాజాలంతో అఫ్గాన్ కెప్టెన్ షాహిదీ (27) ని అవుట్ చేశాడు. గుర్బాజ్, షాహిదీ జోడీ విడిపోవడంతో అఫ్గానిస్తాన్ మిడిల్ ఆర్డర్ మళ్లీ కుప్పకూలింది. తమ కెరీర్‌లో మొదటి వన్డే ఆడుతున్న యువ ఆటగాళ్లు హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్‌లు అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. స్పిన్నర్ హర్ష్ దూబే కేవలం తన 22వ ఓవర్లోనే అజ్మతుల్లా ఒమర్జాయ్ (26), అల్లా గజన్‌ఫర్ (0) లను వరుస బంతుల్లో అవుట్ చేసి మ్యాచ్‌పై భారత్ పట్టును బిగించాడు. ఇక ఇన్నింగ్స్ చివరి ఓవర్ అయిన 25వ ఓవర్లో గుర్నూర్ బ్రార్ వరుసగా రెండు వికెట్లు పడగొట్టి అఫ్గాన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. భారత్ తరఫున డెబ్యూ బౌలర్లు హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ చెరో 3 వికెట్లు తీయగా, అర్ష్‌దీప్ సింగ్ 2, నితీష్ రెడ్డి 2 వికెట్లు సాధించారు. ఇక 195 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగబోతున్న రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్‌ల బ్యాటింగ్ ఎలా సాగుతుందో చూడాలి.

### ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500..

# సెమీస్‌లో సింధు ఓటమి



ఈ ఏడాది తొలి టైటిల్ వేటలో ఉన్న భారత స్టార్ షట్లర్ పి.వి. సింధుకు మరో సారి నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీ ఫైనల్లో టాప్ సీడ్ యమగుచి (జపాన్) చేతిలో సింధు ఓటమిపాలైంది. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అయిన మయగుచి చేతిలో 22-20, 21-12 తేడాతో భారత స్టార్ షట్లర్ పరాజయం చవిచూసి ఫైనల్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలి గేమ్‌లో చాలాసేపు సింధు ఆధిక్యంలో నిలిచింది. కానీ, యమగుచి పట్టువదలకుండా పోరాడటంతో 20-20తో స్కోరు సమం అయింది. ఆ తర్వాత యమగుచి వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో జపాన్ క్రీడాకారిణి జోరు కొనసాగించి సునాయసంగా విజయం సాధించింది.

# 'ఎవరి చేతిలో ఓడినా సరే.. పాక్‌పై మాత్రం వద్దు'..

### జెమీమాతో వాచ్‌మెన్



ఆదివారం క్రికెట్ ప్రేమికులకు పండగే. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లోనే భారత్.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. సాధారణంగా భారత్, పాక్ మ్యాచ్ అంటేనే ఫ్యాన్స్ ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. అలాంటిది వరల్డ్ కప్‌లో దాయాదుల పోరు అంటే చిన్నాపెద్దా అనే తేడాలేకుండా టీవీలకు అతుక్కుపోతారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌తో మ్యాచ్ ముంగిట భారత క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్ జియోస్టార్‌తో మాట్లాడి పలు విషయాలు పంచుకుంది. "నేను భారత్ తరఫున మొదటిసారి పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడింది ఇప్పటికీ నాకు గుర్తుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ మాతో ఇలా అంది. 'ఈ మ్యాచ్‌లో బయటి నుంచి ఒత్తిడి ఉంటుంది. అభిమానులు ఏమి ఆశిస్తున్నారో కూడా మనకు తెలుసు' అని చెప్పింది. చివరకు మా బిల్డింగ్ వాచ్‌మెన్ కూడా 'ఎవరి చేతిలో ఓడిపోయినా సరే.. పాకిస్థాన్ చేతిలో మాత్రం వద్దు' అని నాతో అన్నాడు. మేం 2025 వన్డే ప్రపంచ కప్ సాధించడంలో కోచ్ అమోల్ మజుందార్ కీలకపాత్ర పోషించారు. ఈ సారి కూడా మేం అదే విధంగా ఆడతాం. ప్రతి మ్యాచ్‌కు విభిన్నంగా సన్నద్ధం అవుతాం. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఒత్తిడిలో ఎలా ఆడాలో శిక్షణ పొందుతున్నాం. ప్రిపరేషన్ అద్భుతంగా సాగింది. ఈ జట్టు చాలా ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. సౌతాఫ్రికాతో సిరీస్‌లో మేం బాగా ఆడలేదు. కానీ, కొన్నిసార్లు విజయం కన్నా ఓటమే ఎక్కువ పాఠాలను నేర్పుతుంది" అని జెమీమా వివరించింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com